www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 90 శుక్రవారం, ఆగస్టు 14, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను
# బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్





**హైదరాబాద్,ఆగస్టు 13 :** పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నా మని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు మిగతా2లో...




## పిల్లల ఆరోగ్యంపై
# ఆటలొద్దు

● ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే ● మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం ● కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 :** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని మిగతా2లో...

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి


2లో

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా


2లో

## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

● ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు. ● గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 13 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు మిగతా2లో...


2లో

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి

## బిసి మహిళలకు స్వయం ఉపాధి

ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్,ఆగస్టు 13 :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు మిగతా2లో...

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన
# ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,ఆగస్టు 13 :** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మిగతా2లో...

# పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే కాలేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి


**ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి**

**విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి**

**అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**

**హైదరాబాద్,ఆగస్టు 13 :** రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారు లు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామ మూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డి( స్టిక్ట్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాద య్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగా ల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవా ర్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవం త్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరే కమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృ త్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిం దూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నా రు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం‘అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 :** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 :** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.ది

# బిసి మహిళలకు స్వయం ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్దిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# శాస్త్రీయ పరిశోధనలో రాణిస్తున్న డాక్టర్ సుమతి పోలెబోయిన

## ●ఐకానిక్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డు సాధించిన ప్రతిభావంతురాలు



**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 13( పీపుల్స్ న్యూస్)**
బిలాస్‌పూర్ ఫార్మసీ, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ రంగాల్లో విశేష పరిశోధనలు చేస్తున్న డాక్టర్ సుమతి పోలెబోయిన శాస్త్రీయ రంగంలో తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ గురు ఘాసీదాస్ విశ్వవిద్యాలయం (కేంద్ర విశ్వవిద్యాలయం) ఫార్మసీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.ఎనిమిదేళ్లకు పైగా పరిశోధనా అనుభవం, ఐదేళ్ల బోధనా అనుభవంతో డాక్టర్ సుమతి మోహన్ ప్రయోగాత్మక ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, నానో ఫార్మాస్యూటికల్స్, ప్రీక్లినికల్ వ్యాధి నమూనాలపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. నైపర్-గువాహటి నుంచి ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీలో ఎం.ఎస్. (ఫార్మ్) పూర్తి చేసిన ఆమె, నైపర్ -ఎస్.ఏ.ఎస్. నగర్ నుంచి ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీలో పీహెచ్‌డీ పొందారు.ఆమె పరిశోధనల్లో నానోఫార్మకాలజీ, నానోమెడిసిన్, మధుమేహ సంబంధిత సమస్యలు, ఆస్టియోపోరోసిస్, ఎముకల ఆరోగ్యం, న్యూరోఫా ర్మకాలజీ, గట్ మైక్రోబయోమ్, గట్--బ్రెయిన్ సంబంధాలు, ప్రీక్లినికల్ డ్రగ్ మూల్యాంకనం వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. సెలీనియం, గోల్డ్ నానోపార్టికల్స్ ద్వారా మధుమేహం, అండాశయ తొలగింపు కారణంగా ఏర్పడే ఆస్టియోపోరోసిస్‌పై ఆమె చేసిన పరిశోధనలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

**మూడు భారతీయ పేటెంట్లకు సహకారం**
పరిశోధనతో పాటు నూతన ఆవిష్కరణలపై కూడా డాక్టర్ సుమతి దృష్టి సారించారు. మల్టీ-గేటెడ్ రోడెంట్ బిహేవియరల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ అపరాటస్, లీడ్ కారణంగా గట్ మైక్రోబయోమ్‌లో ఏర్పడే మార్పుల అంచనా, లేయర్డ్ బ్లడ్--బ్రెయిన్ బ్యారియర్ స్క్రీనింగ్ ల్యాబొరేటరీ అపరాటస్ వంటి అంశాలకు సంబంధించిన మూడు భారతీయ పేటెంట్లలో ఆమె భాగస్వామ్యం ఉంది.ప్రతిష్ఠాత్మక అవార్డులు, ఫెలోషిప్‌లుడాక్టర్ సుమతి ప్రతిభకు పలు జాతీయ స్థాయి గుర్తింపులు లభించాయి. 2023లో ఐజీఎన్‌టీయూ, మధ్యప్రదేశ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నానోఫార్మాస్యూటికల్స్ ఆన్ న్యూరోలాజికల్ డిజార్డర్స్‌లో బెస్ట్ ఓరల్ ప్రెజెంటేషన్ అవార్డు అందుకున్నారు.

సీఎస్ఐఆర్--ఎస్ఆర్ఎఫ్ (నెట్ ) పరిశోధనా ఫెలోషిప్‌తో పాటు సి ఎస్ఐఆర్-నెట్ జె ఆర్ ఎఫ్,సిఎస్ఐఆర్-నెట్ లెక్చరర్‌షిప్, గేట్,నీపేర్, జిపిఏటీ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షల్లోనూ ఆమె అర్హత సాధించారు.పరిశోధనా వ్యాసాలతో పాటు పలు శాస్త్రీయ పుస్తక అధ్యాయాలకు ఆమె సహకరించారు. గట్ మైక్రోబయోటా, గట్--బ్రెయిన్ న్యూరోఎండోక్రైన్ మార్గాలు, మైక్రోబయోమ్ డైస్బయోసిస్ తదితర అంశాలపై ఆమె రచనలు చేశారు. 2023లో 'కాన్సెపట్స్ ఆఫ్ క్లినికల్ రీసెర్చ్ అండ్ ఫార్మాకోవిజిలన్స్, 2026 లో ఎక్స్పెరిమెంటల్ ఫార్మకాలజీ ప్రాక్టికల్ హ్యాండ్ బుక్ అనే పుస్తకాలను రచించారు.ఫార్మకాలజీ, టాక్సికాలజీ, నానోమెడిసిన్, బయోమెడికల్ పరిశోధనల్లో విశేష కృషి,పేటెంట్ ఆవిష్కరణలు,శాస్త్రీయ ప్రచురణలు,ఫెలో షిప్‌లు,అవార్డులు, బోధనా అనుభవం కలిగిన డాక్టర్ సుమతి పోలెబోయిన సైన్స్ అండ్ రీసెర్చ్ రంగంలో ఆమె సాధించిన అసాధారణ విజయాలకు గాను సైంటిఫిక్ లారెన్స్ కమిటీ ఐకానిక్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డు అనే ఈ అత్యున్నత అంతర్జాతీయ పురస్కారాన్ని అందజేసింది. ప్రస్తుతం ఆమె నేతృత్వంలో పి.హెచ్డి విద్యార్థులు పలువురు ఎం.ఫార్మ్ విద్యార్థులు పరిశోధనలు సాగిస్తున్నారు ఐకానిక్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డు గ్రహీత డాక్టర్ సుమతి పోలెబోయిన మాట్లాడుతూ నా చదువుకు నా ఈ విజయానికి మూల స్తంభం నా భర్త కొమరం మోహన్ రావు గారు ఆయన సహకారం లేకపోతే నేను ఈ స్థాయిలో ఉండేదాన్ని కాదు ఈ అవార్డును నా భర్తకు అంకితం ఇస్తున్నాను అని భావోద్వేగానికి లోనయ్యారు. మారుమూల ములుగు జిల్లా ఆదివాసి గిరిజన ప్రాంతం నుండి వచ్చిన మహిళా ప్రొఫెసర్ కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల రన్నతపేట గ్రామస్తులు ములుగు జిల్లా ప్రజలు మరియు సెంట్రల్ యూనివర్సిటీ వైస్ - చాన్సలర్, తోటి అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన సినీ నటుడు



**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 13 (పీపుల్స్ న్యూస్)**
మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను గురువారం సీనినటుడు అప్పాజీ అంబరీషా దర్భా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రామప్ప దేవాలయం చాలా అద్భుతమైన నిర్మాణమని కోనియాడారు, కాగా అప్పాజీ అంబరీష శ్రీమంతుడు, కిక్, జవాన్, ఇదం జగత్, శుభలేఖలు, మను,పడి పడి లేచే మనసు, హుషారు, విశ్వాసం, గద్దలకొండ గణేష్, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, భీష్మ తథితర సినిమాలలో నటించారు. వారి వెంట, టూరిస్ట్ పోలీసులు బద్రు, శ్రీకాంత్, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు

# రామప్ప దేవాలయాన్ని సందర్శించిన

● పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి

● కుటుంబ సభ్యులతో కలిసి రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 13 ( పీపుల్స్ న్యూస్)**
మండలంలోని రామప్ప దేవాలయంలో గురువారం శ్రావణమాసాన్ని పురస్కరించుకొని పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు హరిష్ శర్మ వారికి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకముందు భగవాన్ రెడ్డి కుటుంబ సభ్యులు రామలింగేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన ఎన్ డి ఆర్ ఏఫ్ అధికారి







**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 13 (పీపుల్స్ న్యూస్)**
మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను గురువారం ఏన్ డి ఆర్ ఏఫ్ డిప్యూటీ కమాండెంట్ దిల్బాగ్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్ప కళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట, టూరిస్ట్ పోలీసులు బద్రు, శ్రీకాంత్‌దేవాదాయ,పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు

# నల్సార్ విద్యార్థులపై ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకున్న బీసీఐ




**హైదరాబాద్ :** నల్సార్ విద్యార్థుల అంశంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వెనక్కి తగ్గింది. విద్యార్థులపై ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకుంది. నల్సార్ విద్యార్థులు ఎక్కడైనా న్యాయవాదులుగా నమోదు చేసుకోవచ్చని బీసీఐ తెలిపింది. అధికశాతం మంది విద్యార్థులు అమాయకులని, వర్సిటీ స్నాతకోత్సవంలో సీజేఐ పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తున్న ప్రచారంలో పాల్గొనే ఉద్దేశం వారికి లేదని తెలిన తర్వాత బీసీఐ ఈ మార్పు చేసింది.అంతకు ముందు.. సీజేఐకి వ్యతిరేకంగా నల్సార్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రవర్తనపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆగ్రహం వ్యక్తం చేసింది. సీజేఐ నుంచి పట్టాలు అందుకోబోమని ఇటీవల నల్సార్ విద్యార్థులు ఉపకులపతి(వీసీ)కి లేఖ రాశారు. ఈ ఘటనపై ఆగస్టు 19వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని వర్సిటీ వీసీని బీసీఐ ఆదేశించింది. ఆ నివేదిక ఆధారంగా విద్యార్థులపై తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొంది. అప్పటి వరకు నల్సార్ విద్యార్థులు ఏ బార్ కౌన్సిల్‌లోనూ నమోదు చేసుకోవద్దని బీసీఐ స్పష్టం చేసింది.అధికశాతం మంది విద్యార్థులు అమాయకులు : ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో బీసీఐ ఛైర్మన్ ఇలా అన్నారు. 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నల్సార్? లా వర్సిటీ వైస్ ఛాన్సలర్, అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల కార్యదర్శులకు ఈ రోజు జారీ చేసిన లేఖపై కౌన్సిల్ క్షుణ్ణంగా చర్చించి, మంతనాలు జరిపింది. చర్చల అనంతరం, తాజా నివేదిక ప్రకారం, నల్సార్ విద్యార్థులలో(2026లో ఉత్తీర్ణులయ్యే వారిలో) అధికశాతం మంది అమాయకులని, ఈ అగౌరవ చర్యలో పాల్గొనేందుకు సముఖంగా లేరని సభ్యులు ఏకాభిప్రాయానికి వచ్చారు' అని పేర్కొన్నారు. తదనుగుణంగా, రాష్ట్ర బార్? కౌన్సిళ్లలో నల్సార్ విద్యార్థుల నమోదుపై నిషేధానికి ఇంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను కౌన్సిల్ సవరిస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.అంతకు ముందు.. సీజేఐకి వ్యతిరేకంగా నల్సార్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రవర్తనపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆగ్రహం వ్యక్తం చేసింది. సీజేఐ నుంచి పట్టాలు అందుకోబోమని ఇటీవల నల్సార్ విద్యార్థులు ఉపకులపతి(వీసీ)కి లేఖ రాశారు. ఈ ఘటనపై ఆగస్టు 19వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని వర్సిటీ వీసీని బీసీఐ ఆదేశించింది. ఆ నివేదిక ఆధారంగా విద్యార్థులపై తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొంది. అప్పటి వరకు నల్సార్ విద్యార్థులు ఏ బార్ కౌన్సిల్‌లోనూ నమోదు చేసుకోవద్దని బీసీఐ స్పష్టం చేసింది.

# ముదిరాజ్ యువత మెపా లోకి రావాలి

◆50 సంవత్సరాలు దాటిన ప్రతి ముదిరాజుకు ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలన్నారు.

◆ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం, వెల్తుర్లపల్లి లో..

◆పల్లె పల్లె కు మెపా లో వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్







**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 13 (పీపుల్స్ న్యూస్)**

రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలంటే ముదిరాజ్ యువత మెపా లోకి రావాలని, గౌడలకు చేనేత వృత్తి కార్మికులకు ఇస్తున్నటువంటి పెన్షన్ ముదిరాజులకు కూడా ఇవ్వాలని ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ అన్నారు.పల్లె పల్లె కు మెపా లో భాగంగా ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు ముదిరాజ్ అధ్యక్షతన ములుగు జిల్లా వెంకటాపురం మండలం, వెల్తుర్ల పల్లె గ్రామంలో ముదిరాజులతో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజులు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని అందుకు మెపా ను వేదిక చేసుకోవాలని,ఈ సందర్భంగా వృత్తి కార్మికులైన చేనేత కార్మికులకు గౌడలకు ఇస్తున్నటువంటి పెన్షన్ ను, 50 సం.నిండిన ప్రతి ముదిరాజ్ కు ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలని దానికి మంత్రి వాకిటి శ్రీహరి చొరవ తీసుకోవాలని అన్నారు. పట్టణాలకే పరిమితం కాకుండా ప్రతి పల్లె పల్లె గ్రామీణ ప్రాంతాలకు మెపా వెళుతుందని ఈ సందర్భంగా వెల్తుర్ల పల్లెకు రావడం జరిగిందని అన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన శతాబ్ది వృద్ధురాలు కొంతం శాంతమ్మ ముదిరాజ్ దశదినకర్మకు హాజరై నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మెఫా జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు ముదిరాజ్, ఉపాధ్యక్షులు భూమా నరేష్ ముదిరాజ్, వెంకటాపూర్ మండల అధ్యక్షులు మేకల రమేష్ ముదిరాజ్, కొంతం రామ్ దాస్, కొంతం దేవేందర్, కొంతం సంజీవ్, కొంతం రాజయ్య, శ్రావణ్ కుమార్, శివ సాగర్, శ్యాంసుందర్, రెడ్డి గణపతి, రెడ్డి దామోదర్, డాక్టర్ తిరుపతి పాల్గొన్నారు.

## కొల్చారం మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేల జరిమానా



**కొల్చారం, ఆగస్టు 13**

మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గల ఎన్‌హెచ్--765డీ రహదారిపై గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. కొల్చారం ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారిని మెదక్ కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో విక్రమ్ కుమార్, తండ్రి మనోహర్ రావుకు కోర్టు రూ.10,000 జరిమానా విధించింది.మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 18 మందికి ఉచిత కంటి పరీక్షలు

- పేదల కంటి సమస్యలకు మేమే భరోసా రాజనకు రామచంద్రం



**చేగుంట, ఆగస్టు 13**

చేగుంట మండల కేంద్రంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో స్థానిక ఐశ్వర్య ఐ కేర్‌బినందు ఆప్తమాలజిస్ట్ శిరీష ఆధ్వర్యంలో ఉచిత పర్మనెంట్ కంటి పరీక్షా కేంద్రం నిర్వహించారు.ఈ శిబిరంలో 18 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాజనకు రామచంద్రం మాట్లాడుతూ "సర్వేంద్రియానాం నయనం ప్రధానం" అనే సూక్తితో ప్రతి ఒక్క పేదవారికి కంటి సమస్యలు లేకుండా చూడడమే మా బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రచనకు రామచంద్రం, సెక్రటరీ బుర్కా నాగరాజు, ట్రెజరర్ దుర్గం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## 'సర్'లో సొంతూళ్లకే మొగ్గు



**వరంగల్:** ప్రత్యేక ఓటరు సవరణ జాబితా(ఎస్ఐఆర్) ప్రక్రియలో పట్టణాల్లో ఉంటున్న పల్లెవాసులు తమ ఓటు హక్కును పల్లెల్లో ఉంచుకోవడానికే ప్రాధాన్యతనిచ్చారు. ఈ నెల 10వతేదీతో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసిన సందర్భంగా ఎన్నికల సంఘం విడుదల చేసిన వివరాల్లో పట్టణాల్లోని అధిక ఓట్లు శాశ్వతంగా మార్చుకున్నట్లు వెల్లడైంది.వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలలో అధికంగా గ్రామీణ ప్రాంతా ల నుంచి పిల్లల చదువు, వ్యాపారం, ఉద్యోగం, ఉపాధి కోసం వచ్చిన వారు ఇంతకాలం తమ సొంత ఊళ్లలో, పట్టణ ప్రాంతంలో రెండు చోట్ల ఓట్లు వేసేవారు.ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఎస్ఐఆర్‌తో పట్టణాల్లో ఉంటున్న వారంతా తమ ఓటును తమ సొంత ఊళ్లలో ఉండేలా చూసుకున్నారు. ఎందుకంటే గ్రామా ల్లో ఓటు హక్కు ఉన్నట్లయితే తమకు రావా ల్సిన అన్ని రకాల ప్రభుత్వ పథకాలు, రైతు బంధు, ఉపాధి హామీ లాంటి అనేక పథకాలు వస్తాయని, లేదంటే అవన్నీ కోల్పోయే ప్రమాదముందని గ్రహించారు. పట్టణాల్లో ఉంటున్నా పల్లెల్లోనే ఓటు హక్కు ఉండేలా తమ ఓటును ఎస్ఐఆర్‌లో పర్మినెంట్ షిఫ్టింగ్ చేసుకున్నారు. దీంతో అటు పట్టణాల్లో ఇటు పల్లెల్లో వేసే డబుల్ ఓటింగ్‌కు అడ్డుకట్టపడిం ది. పర్మినెంట్ షిఫ్టింగ్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి అత్యధిక ఓటర్లు ఉన్నారు.ష్ట్రఅ౨2.2.ఌజూస్త్రఅందులో వరంగల్ తూర్పు నియోజకవర్గం లో మొత్తం 2,60,437 మంది ఓటర్లు ఉండగా అందులో 30,411 మంది పర్మినెంట్ షిఫ్టింగ్ చేసుకున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,76,272 ఉండగా, అందులో 18,307 మంది ఓటర్లు పర్మినెంట్‌గా తమ ఓటును షిఫ్టింగ్ చేసుకున్నారు. అదేవిధంగా నర్సంపేట నియోజకవర్గంలో ం ఓటర్లు 2,40,244 ఉండగా అందులో 7,857 మంది ఓటర్లు పర్మినెంట్ షిఫ్టింగ్ చేసుకున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు మేడారం ముస్తాబు.

- ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి.
- మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.
- సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్లకు శ్రీకారం.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క















**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 13( పీపుల్స్ న్యూస్)**

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మేడారం ప్రాంతాన్ని ముస్తాబు చేయాలని, ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.గురువారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల సన్నిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారుఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం ప్రాంగణానికి వచ్చి శ్రీ సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు మహాజాతరకు ముందు కుటుంబ సమేతంగా వనదేవతలను దర్శించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో బస చేసి, ములుగు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని తెలిపారు.ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి మరోసారి మేడారానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన విస్తరణ, అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.మేడారానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరఫున పేరుపేరునా స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.వనదేవతలను దర్శించుకున్న అనంతరం శ్రీ సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే లక్ష్యంతో సంతృప్తి స్థాయిలో పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, అర్హులను గుర్తించి పింఛన్లు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు. సమ్మక్క--సారలమ్మ తల్లుల దీవెనలతో ప్రతి మహిళ సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని వారి సన్నిధి నుంచే ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏటూర్ నాగారం ఏ.ఎస్.పి మనన్ భట్, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, గుత్తేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానం అన్ని దానాల్లోకెల్లా ఒక గొప్ప దానం...!

## - జనగామ జిల్లా చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్...!!

**జనగామ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 13 :**

గురువారం రోజున " అవయవ దాన దినోత్సవం " సందర్భంగా జనగామ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్ కార్యదర్శి–ఆదేశాలతోషామీర్పేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో... పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో... జనగామ జిల్లా చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "మనిషి మరణించిన తరువాత కూడా మరొకరి జీవితంలో వెలుగును నింపగలగడం కంటే గొప్ప మానవతా సేవ మరొకటి ఉండదు అని పేర్కొన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్ల వంటి అవయవాలను అవసరమైన వారికి అందించడం ద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. "న్యాయ సేవా సంస్థల పరంగా కూడా ప్రజలకు వారి చట్టపరమైన హక్కులు, అవయవ దానానికి సంబంధించిన విధానాలు, కుటుంబ సభ్యుల పాత్ర గురించి అవగాహన కల్పించే దిశగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా సమూహాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు అని దీనికి ప్రతి ఒక్కరి సహకారం



"ఒకరి జీవితానికి ముగింపు వచ్చినా, మరొకరి జీవితానికి కొత్త ఆరంభం, మన సమాజంలో అవయవ దానం గురించి ఇంకా అనేక అపోహలు, భయాలు ఉన్నాయి. అవగాహన లేకపోవడం వల్ల ఎంతోమంది అవసరమైన అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారు అని తెలిపారు. అందువల్ల అవయవ దానం గురించి శాస్త్రీయమైన మరియు వాస్తవమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం కాబట్టి, అవయవ దానం పై ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయ అవగాహనను పెంపొందించేలా. కార్యాచరణను రూపొందించాలని అన్నారు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురా లు పద్మ "అవయవ దానం కేవలం వైద్యపరమైన అంశంతో పాటు ఇది మానవత్వం, దాతృత్వం మరియు సామాజిక బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల రవీందర్, పి ఎల్ వి రాజశేఖర్, ప్రధానోపాధ్యా యురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, డిఎల్ఎస్ సూపర్డెంట్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి.

- పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి అనసూయ సీతక్క.
- ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.














**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లాలో ఈ నెల 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కి ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని అధికారులను సూచించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి ఎనిముల రేవంత్ రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నాశీ సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం వనదేవతల సన్నిధి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారిని గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రం నకు చేరుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పెద్ద ఎత్తున రహదారి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసే సభలో ప్రజలు, అభిమానులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ములుగు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ

**నూతన విద్యార్థులను స్వాగతించిన స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్**






**పటాన్ చెరు, ఆగస్టు 13:**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 2026-27 బ్యాచ్ కు ఘనంగా ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించి, నూతన విద్యార్థులను ఘనంగా స్వాగతించాయి. సంగీతం, నృత్యం, స్కిట్లు, ర్యాంప్ వాక్ లు, విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో గీతం ప్రాంగణమంతా కళకళలాడింది. ఫుడ్ స్టాల్స్, ఆటలు, ఫోటోబూత్ లు పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఫ్రెషర్స్ కు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, తోటి విద్యార్థులు, సీనియర్లతో మమేకమవ్వడానికి ఒక అవకాశాన్ని కల్పించాయి. విద్యార్థులు నేర్చుకోవడానికి, ఒకరితో ఒకరు మమేకమవ్వడానికి, తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, చిరస్మరణీయమైన జ్ఞాపకాలను నిర్మించుకోవడానికి ప్రోత్సహించే ఉత్సాహభరితమైన ప్రాంగణ వాతావరణాన్ని సృష్టించాలనే గీతం నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. తమ విశ్వవిద్యాలయ ప్రయాణానికి ఒక చిరస్మరణీయమైన ఆరంభాన్ని అందించినందుకు ఫ్రెషర్స్ తమ సీనియర్లకు కృతజ్ఞతలు తెలియజేయడంతో, ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# ముత్యంరెడ్డి కృషి మరువలేనిది: వడ్ల నవీన్ కుమార్

**- చేగుంటను విద్యా హబ్ గా తీర్చిద్దిన ఘనత మాజీ మంత్రిదే**



**చేగుంట, ఆగస్టు 13**
చేగుంట మండల కేంద్రంలోనిస్థానిక టి జి ఎం ఎస్ మోడల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ చంద్రకళ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ మాట్లాడుతూ చేగుంటలో మోడల్ స్కూల్, పాలిటెక్నిక్, స్పోర్ట్స్ స్కూల్, జూనియర్ కళాశాల వంటి విద్యా సంస్థలను అందించి విద్యా హబ్ గా తీర్చిద్దిన ఘనత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి దేనని కొనియాడారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి చేగుంట పేరు, తమ తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ రఫీ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాకు పటిష్ట చర్యలు రైతులకు అధికారుల భరోసా

**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/**
గంభీరావుపేట మండలం కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో అధికారులు స్పందించి రైతులతో మాట్లాడారు. యూరియా సకాలంలో అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గంభీరావుపేట తహశీల్దార్ మారుతి, వ్యవసాయ అధికారి సలావుద్దీన్, ఎస్ఐ శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు అజయ్, ప్రవీణ్, సొసైటీ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు. తహశీల్దార్ మారుతి మాట్లాడుతూయూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. రైతులకు సకాలంలో యూరియా అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు. యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపడతామని, సొసైటీలో ఉన్న స్టాక్ పూర్తయ్యేలోపే అవసరమైన యూరియాను లారీల ద్వారా తెప్పించి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ అధికారి సలావుద్దీన్ మాట్లాడుతూరైతులకు అవసరమైన సమయంలో యూరియా అందేలా వ్యవసాయ శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సొసైటీలో యూరియా స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, స్టాక్ తగ్గిన వెంటనే ముందస్తుగా లారీల ద్వారా కొత్త సరుకును తెప్పించేలా చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం అధికారులు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, యూరియా సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు రైతులు కూడా అధికారులకు సహకరించాలని సూచించారు.

# ప్రైవేట్ బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ.. ఇద్దరు మహిళల మృతి

**నిజామాబాద్, ఆగస్టు 13:** జిల్లాలోని ఆర్మూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోవింద్‌పేట్ ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును కంటైనర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేటు బస్సు టైర్ పంక్చర్ అవడంతో బస్సును డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు బస్సు ఎదుట ఉన్న డివైడర్‌పై కూర్చుకున్నారు. ఇదే సమయంలో అతివేగంతో దూసుకొచ్చిన కంటైనర్ లారీ.. వెనుక నుంచి బస్సును ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సు ముందు డివైడర్‌పై కూర్చున్న మహిళలపైకి బస్సు టైర్ ఎక్కడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శుక్రవారం, ఆగస్టు 14, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 6

# "కబ్జా చేస్తే నీకేంటి?"..

●జర్నలిస్టుకు MRO వివరణ !.
●ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే ... నీకేం సంబంధం అన్న ఎమ్మార్వో.
●నిర్మాణంపై అధికారులు నోటీసులు.. వివరణ కోరితే తహసీల్దార్ తీరుపై విమర్శలు.



**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్)**
గాజులరామారం సర్వే నంబర్ 329లో ఉన్న ప్రభుత్వ భూమిని ఓ రాజకీయ నాయకుడు అతని పలుకుబడి, పరపతి ఉపయోగించి కబ్జా చేశారని ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. సుమారు 283 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు రావడంతో సంబంధిత అధికారులు ఇప్పటికే సదరు నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారంపై మండల తహసీల్దార్‌ను వివరణ కోరిన ఎడిటర్/జర్నలిస్టుకు ఆయన స్పందించిన తీరు ఇప్పుడు వివాదానికి దారితీసింది.ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతోందన్న సమాచారంతో సంబంధిత తహసిల్దార్ ను ఫోన్ లో సంప్రదించిన జర్నలిస్టు.. సర్వే నంబర్ 329లో జరుగుతున్న నిర్మాణంపై వివరాలు అడిగారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్పందిస్తూ, "కబ్జా చేస్తే నీకేం సంబంధం?", "నువ్వు జర్నలిస్టువా? విలేకరివా?" అంటూ ప్రశ్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ప్రభుత్వ భూమి పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన రెవెన్యూ అధికారి.. అక్రమ నిర్మాణంపై సమాచారం కోరిన జర్నలిస్టును ప్రశ్నించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం జరిగితే దానిపై ప్రశ్నించడం ప్రజా ప్రయోజనానికి సంబంధించిన అంశమని, అధికారుల నుంచి వాస్తవాలు తెలుసుకోవడం జర్నలిస్టుల విధుల్లో భాగమనే విషయం ఆయనకు తెలియకపోవడం మరింత బాధాకరం.

**నోటీసులు ఇచ్చింది అధికారులే.. మరి సమాధానం ఎందుకు లేదు**
సర్వే నంబర్ 329లో సుమారు 283 గజాల స్థలంలో నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసి నిర్మాణదారుల నుంచి వివరణ కోరినట్లు తెలుస్తోంది. అయితే అదే అంశంపై ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే స్పష్టమైన వివరాలు ఇవ్వాల్సిన అధికారులే.. ప్రశ్నించిన వ్యక్తి జర్నలిస్టా, విలేకరా అంటూ వాదనకు దిగడం చర్చనీయాంశంగా మారింది.ఈ ప్రభుత్వ స్థల వ్యవహారం వెనుక ఓ రాజకీయ నాయకుడి ప్రమేయం ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు ప్రభుత్వ భూములపై కన్నేస్తే అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు."అక్రమ నిర్మాణం జరిగిందా? ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందా? నోటీసులు ఎందుకు ఇచ్చారు? తదుపరి చర్యలు ఏమిటి?" వంటి ప్రశ్నలకు రెవెన్యూ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉన్నప్పటికీ తమకేం తెలియదు అన్నట్లు వ్యవహరిస్తూ కబ్జా రాయుడితో చేతులు కలిపి బారి మొత్తంలో ముడుపులు తీసుకున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.




**ఎమ్మార్వో వైఖరి పై ఉన్నతాధికారుల దృష్టి సారించాలి.**
ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి ప్రభుత్వ స్థలంలో కబ్జా ఆరోపణలు వచ్చినప్పుడు అధికారులు వాస్తవాలను పరిశీలించి, అక్రమం జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, ఈ వ్యవహారంపై సమాచారం కోరిన జర్నలిస్టుతో అధికారి వ్యవహరించిన తీరుపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమి ఎవరి సొత్తు? కబ్జా ఆరోపణలపై చర్యలు ఎప్పుడు? రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులకు అధికారులు ఎందుకు మద్దతిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.ఈ వ్యవహారంపై తహసీల్దార్ నుంచి అధికారిక వివరణ తీసుకోవడంతో పాటు, సర్వే నంబర్ 329లోని భూమి రికార్డులు, స్థల పరిస్థితి, జారీ చేసిన నోటీసులు, నిర్మాణానికి సంబంధించిన అనుమతులను ఉన్నతాధికారులు పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

# రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారిద్దాం

**తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు**





**మల్కాజిగిరి కమిషనరేట్,క్రైమ్ బ్యూరో,ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్) :** రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారిద్దామని తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు అన్నారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు,. ఉపాధ్యాయులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులకు హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించడం, మైనర్ డ్రైవింగ్‌ను నిరోధించడం, లేన్ క్రమశిక్షణ పాటించడం, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

# కుషాయిగూడలోని ఎన్ఎఫ్సీ ప్రాంగణంలో భద్రతా మాక్ డ్రిల్



**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్) :**
కుషాయిగూడ లోని ఎన్ఎఫ్సీ వద్ద భద్రత మాక్ డ్రీల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కీలకమైన సంస్థల ప్రాంగణాలు , పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది అప్రమత్తత, అత్యవసర పరిస్థితుల్లో స్పందన సామర్థ్యాన్ని సమీక్షించారు.

# నేడు ట్యాంక్‌బండ్ పై 'తిరంగా ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు

**హైదరాబాద్** కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్): ఆగస్టు 14న ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుండి చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని ఎం-47 ప్యాటన్ ట్యాంక్ వరకు నిర్వహిస్తున్న "తిరంగా ర్యాలీ" సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక మళ్లింపులు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు అవసరమైన మేరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపారు.సెయిలింగ్ క్లబ్ వద్ద:కర్బాలా మైదాన్ వైపు నుండి అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే సాధారణ వాహనాలను అప్పర్ ట్యాంక్‌బండ్‌పైకి అనుమతించరు. ఈ వాహనాలను సెయిలింగ్ క్లబ్ వద్ద కవాడిగూడ వైపు మళ్లిస్తారు. డిబిఆర్ మిల్స్ వద్ద:డిబిఆర్ మిల్స్ వైపు నుండి అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే సాధారణ వాహనాలను అనుమతించరు. వీటిని డిబిఆర్ మిల్స్ వద్ద గోశాల - కవాడిగూడ వైపు మళ్లిస్తారు.ట్రాఫిక్ రద్దీ ఏర్పడే జంక్షన్లు:ఆగస్టు 14న మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపుల వల్ల క్రింది జంక్షన్లలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి ప్రయాణికులు ఈ ప్రాంతాలను నివారించాలని సూచించారు. ర్యాలీ పూర్తయిన వెంటనే రహదారులపై ఉన్న ఆంక్షలు/మళ్లింపులను తొలగించి, మార్గాలను సాధారణ రాకపోకలకు పునరుద్ధరిస్తారు. పౌరులందరూ ఈ మళ్లింపులు మరియు రద్దీ పాయింట్లను గమనించి, తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు. తాజా ట్రాఫిక్ సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్ పేజీ facebook.com/HYDTP మరియు ఠ (ట్విట్టర్) ఖాతా ఏన్ఖూ లను పరిశీలించవచ్చు. ప్రయాణంలో ఏవైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే లేదా సాయం కావాలంటే ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626 కు కాల్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.




# ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

**- మేడిపల్లి ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్**

**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్) :** ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశించారు. గురువారం మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి ఏసీపీ కార్యాలయాన్ని ఆమె సందర్శించి, కార్యాలయ నిర్వహణ, విధుల అమలు తీరును పరిశీలించారు. పెండింగ్ కేసులు, సిబ్బంది, శాంతి భద్రతలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడిపల్లికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. సిబ్బంది సంక్షేమం బలపడితే ప్రజా సేవ మరింత బలపడుతుందన్నారు. మేడిపల్లిలో నిర్మిస్తున్న మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ హెడ్క్వాటర్స్, భవన నిర్మాణం దాదాపు పూర్తయిందన్నారు. అంతకు ముందు అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని, సిబ్బంది సంక్షేమం, మెరుగైన పని వాతావరణం, సమర్థవంతమైన పోలీసింగ్ , ప్రజలకు మెరుగైన సేవలందించడంపై సూచనలు, సలహాలు అందించారు.



# గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలి

**ట్రాఫిక్-3 డీసీపీ రాహుల్ హెగ్డే బి.కె**







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్) :**
గణేష్ ఉత్సవాలను అత్యంత వైభవంగా, సురక్షితంగా , ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని ట్రాఫిక్-3 డీసీపీ రాహుల్ హెగ్డే బి.కె అన్నారు. రాబోయే వినాయక చతుర్థి ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు గురువారం చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కీలక సమన్వయ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వుల మేరకు ఈ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ట్రాఫిక్-3 డీసీపీ రాహుల్ హెగ్డే బి.కె., చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కె. సత్యనారాయణ సంయుక్తంగా అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమం లో సంబంధిత జోన్‌కు చెందిన ట్రాఫిక్ మరియు లా డ ఆర్డర్ ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు (ఎస్‌హెచ్‌ఓ/ఇన్‌స్పెక్టర్లు), పలు ప్రభుత్వ శాఖల అధికారులు, అలాగే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.గణేష్ ఉత్సవాలను అత్యంత వైభవంగా, సురక్షితంగా మరియు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ఉత్సవాల ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయం , భక్తుల రద్దీ నియంత్రణ ఇతర అవసరమైన జాగ్రత్తలపై సమగ్రమైన ప్రణాళికలను రూపొందించారు.

# సంపాదకీయం

## పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు !

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నియోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బలంగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృథా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

- ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి


**న్యూఢిల్లీ,ఆగస్ట్13:** ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం

### ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం
### రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి
### సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ



**హైదరాబాద్,ఆగస్ట్13:** రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్‌కు పాక్ అండ

### పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు
### అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన

**న్యూఢిల్లీ,ఆగస్ట్13:** పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

# రేషన్‌కార్డుల లక్ష్యమేంటి?



రేషన్‌కార్డుల అసలు లక్ష్యం ఆహారభద్రత. కానీ ప్రజలకు అవి పూర్తిస్థాయి ప్రయోజనాన్ని అందించలేక పోతున్నాయి. ఆ కార్డును ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హతగా పరిగణించడం దాని అసలు లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పాలక పార్టీలు అధికార కాంక్షలకు ఆ కార్డులను ఆయుధంగా వాడుకుంటున్నాయి. ఓట్లు, సీట్ల రాజకీయాల చేస్తూ కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిస్తున్నాయి. నిరుపేదలకొచ్చేసరికి లెక్కలు కడుతున్నాయి. అంతేగాక ఉచితాల పేర పథకాలను ఎత్తేసే కుట్రలూ చేస్తున్నాయి. కొత్త పథకాల సంగతి పక్కనబెడితే, ఉన్నవి ఊడపీకే పరిస్థితులను కల్పి స్తున్నాయి. రేషన్‌కార్డుల ద్వారా కనీస సరుకులు ఇవ్వాల్సిందిపోయి, బియ్యమొక్కటేనన్న దుస్థితికి లబ్దిదారులను నెట్టేశాయి. తెలంగాణలో 2014 తర్వాత కొత్త రేషన్ కార్డులివ్వలేదు. నూత నంగా పెండ్లి చేసుకున్న వారికి, వలసెళ్లిన వారికి కార్డులు మం జూరు కావడం లేదు. చిన్న చిన్న కారణాలతో ఉన్న కార్డులను రద్దుచేసే పరిస్థితి నెలకొంది. అన్నీ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రాథమిక కెవైసీగా మారింది. కొత్తగా తెల్ల రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న సంగారెడ్డిలో చేపట్టనుంది.వీటిని కొత్తగా ఇవ్వడం లేదు. కార్డుల సంఖ్యను పెంచితే సరిపోతుందనే భావనలో ప్రభుత్వం ఉంది. అదే గొప్పగా అన్నట్టుగా వ్యవ హరిస్తున్నది. ఈ కార్డులతో ఉపయోగం అంతంత మాత్రమే. నిరుపేదల కనీసావసరాలనూ తీర్చడం లేదు. ఆయా ప్రభుత్వాలు వీటిని దశలవారీగా నిర్వీర్యం చేస్తూ వస్తున్నాయి. గతంలో ఇచ్చిన సరుకులేవి లబ్దిదారులకు నేడు అందడం లేదు. దారిద్ర్యరేఖ దిగువనున్న వారికి రేషన్‌కార్డులను ఎర వేయడం ద్వారా ఎన్నికల రాజకీయాలను గట్టెక్కే ప్రయత్నమే ఎక్కువగా జరుగుతున్నది. ఆ ఇచ్చే కార్డులతో ప్రజలకు ఎంతమేరకు మేలు జరుగుతున్నది ? ఏ తరహా ప్రయోజనం ఒనగూరుతున్నదనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.ఒట్టి బియ్యమిచ్చి అదే పదివేలు అన్నచందంగా మార్చే శారు. ఉమ్మడి రాష్ట్రంలో బియ్యంతోపాటు కంది, గోధుమలు, పామా యిల్, ఉప్పు, చక్కెర, చింత పండు, కారం, పసుపు తదితర తొమ్మిది రకాల వస్తువులకు నిరుపేదలకు చేరేవి. అప్పట్లో కిరోసిన్ సైతం సరఫరా జరిగేది. అనక గులాబీ సర్కారు కాస్త సంచిని మొత్తం ఖాళీ చేసేసింది. పూర్తిగా బియ్యంతో నింపేసింది. దీంతో సామాన్యులు పౌష్టికా హార లోపాన్ని తీవ్రంగా ఎదుర్కొవాల్సి వస్తున్నది. ప్రధానంగా పిల్లలు, మహి ళలు, రక్తహీనతకు లోనై అనారోగ్యం పాలవు తున్నారు. అది ఏకంగా జాతీయ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన బరువును కోల్పోయే దుస్థితికి కారణమైంది. మానసీక, శారీరక ఎదుగుదలా మందగిస్తున్నది. కోటికిపైగా రేషన్‌కార్డులి స్తున్నామంటూ గొప్పలుపోతున్న సర్కారు, అమ్మహస్తం సంచిని తిరిగి నింపి నిరుపేదలకు పంచుతుందా? లేదా? అనే సంగతిని పంద్రాగస్టున జరిగే సంగారెడ్డి సభలో ప్రకటించాలి. అంతకుముందు రోజున జరిగే రాష్ట్ర క్యాబి నెట్‌నూ చర్చించాలి. వామపక్ష సర్కార్ కేరళలో అధికారంలో ఉన్నప్పుడు పద్నాలుగు రకాల సరుకులను అందించింది. అక్కడ అమలు చేసిన విధానాన్ని తెలుసుకోవాలి. పేరుకు కార్డులిచ్చి 'తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి' అంటే సరిపోదు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్న ముఖ్యమంత్రి, మంత్రుల హామీలు ఆచరణలో రుజువు చేయాలి. రాజకీయ భావోద్వేగాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, తన మ్యానిఫెస్టోను మననం చేసుకోవాలి. ఆ దిశగా సర్కారును నడిపించాలి. రాజకీయ పక్షాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. ఉండాలి కూడా. లేకపోతే భావాల ఘర్షణ జరగదు. పాలన రోటీన్‌గా సాగి ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంది. బహిరంగ మార్కెట్‌ను చూస్తే భారాలమయంగా మారింది. సర్కారీ రేషన్‌షాపులు, సూపర్‌బజార్లలో సరుకులు నిండుకుం టున్నాయి. ప్రతిమనిషికి నెలా నెలా ఆరుకిలోల బియ్యం ఇస్తే సరిపోతుందా? అనేది ఆలోచించాలి. అన్నం పెట్టినోళ్లు,, మిగతా వాటి గురించి ఎందుకు పట్టించుకోరు? కోవిడ్ సమయంలో కీలకపాత్ర పోషించిన రేషన్‌డీలర్లను నామమాత్రం చేశారు. నేడు రేషన్‌కార్డు ఒక 'మాస్టర్ కీ'గా మారి పోయింది. కార్డు లేకపోతే ఆరోగ్యశ్రీ లేదు, పెన్షన్ లేదు, ఇల్లూ లేదు. సర్కార్ రకరకాల సరుకులివ్వడం ద్వారా రేషన్‌కార్డును బలోపేతం చేస్తేనే నిరుపేద కడుపు నిండుతుంది. ఈ విషయాన్ని పాలకులు గుర్తెరగాలి. ఆదిశగా కార్యాచరణ చేపట్టాలి. లేదంటే భవిష్యత్తులో రేషన్ కార్డు అంటే పథకాలకు లబ్దిదారులను గుర్తించడానికేనని అనుకోవాల్సి వస్తుంది.

# ఒత్తిడి వల్ల శరీరం విశ్రాంతి కోల్పోతుందా? – నాడీ వ్యవస్థను ప్రశాంతపరిచే మార్గాలు ఇవేనట!




ఒత్తిడి తీవ్రమైతే నాడీ వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. దీంతో మనసు ఉద్రిక్తంగా మారుతుంది. శరీరం విశ్రాంతిని కోల్పోతుంది. ఈ క్రమంలో నాడుల స్పందనను నెమ్మదింపజేయడానికి ఎన్నో పరిష్కారాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.

ఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, ఆందోళన తరచూ శరీరంలో మొదలవుతుంది కానీ, మనసులో కాదు. ఇది నాడీ వ్యవస్థను శాంతపరచడం ద్వారా జరుగుతుంది. కాబట్టి, మన ఆలోచనల్ని దానిపై మళ్లించడం, శ్వాసను గమనించాలి. అలాగే, నేలపై మన పాదాలను అనుభూతి చెందడం, చుట్టూ ఉన్న పరిసరాలపై శ్రద్ధ పెట్టాలి. ఇది మిమ్మల్ని ఆలోచనల నుంచి బయటకు తీసుకువచ్చి, వర్తమానంలోకి తీసుకురావడానికి సహాయపడుతాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా, ఒత్తిడి తగ్గుతుందంటున్నారు.మానసిక స్థితిని అర్థం చేసుకోవడం : నాడీ వ్యవస్థ ఎప్పుడు ఉత్తేజితమవుతుందో మొట్టమొదట గుర్తించాలి. 'ఇప్పుడు నా శరీరంలో ఏం జరుగుతోంది? నేను కోపంగా, అశాంతితో లేదా ఆందోళనగా ఉన్నానా? అని మనల్ని మనం ఆత్మావలోకనం చేసుకోవాలి. ఇలా చేస్తే ప్రతిచర్య, ప్రతిస్పందన మధ్య ఓ విరామాన్ని సృష్టించి ఒత్తిడిని దూరం చేస్తుందంటున్నారు నిపుణులు

"ప్రెగ్నెన్సీ"లో నిద్ర పట్టడం లేదా? – ఇలా చేస్తే మంచిదట!వేగాన్ని తగ్గించుకోవడం : ఒత్తిడి, ఆందోళన అత్యవసరాన్ని సృష్టిస్తాయి. ప్రతి పని ముఖ్యమైనదిగా అనిపిస్తుందట. మన నాడీ వ్యవస్థ వేగానికి ప్రతిస్పందిస్తుంది. కాబట్టి, కదలికలు, మాటలు, శ్వాసను నెమ్మదిగా చేయడం ద్వారా మనం సురక్షితంగా ఉన్నామని శరీరానికి సంకేతం పంపొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.మనం తరచూ ఒత్తిడి, ఆందోళనకు గురైనట్లు లేదా విశ్రాంతి లేనట్లుగా కనిపిస్తే, ఈ స్థితిలో ఎక్కువ సేపు గడిపామని దానర్థం. ఇలాంటప్పుడు ఒత్తిడి, ఆందోళన ఎక్కడ మొదలైందో ఆలోచించాలి. నాడీవ్యవస్థ స్తంభించడానికి కారణాలను తెలుసుకోవాలి. నాడీవ్యవస్థను నియంత్రించుకోవాలి. అంటే, మన శరీరం ప్రశాంతంగా ఉండటానికి తగినంత సురక్షితంగా భావించేలా సహాయపడాలి. – ఒవెన్ ఓ కెన్, బ్రిటన్?కు చెందిన సుప్రసిద్ధ మనోవైద్య నిపుణుడు

అంతర్గత సంఘర్షణకు చెక్ : ఒత్తిడి భావనను ప్రతిఘఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, టించడానికి బదులుగా దాన్ని అనుమతించాలట. మన భావాలతో పోరాడినప్పుడు మరో పొర ఉద్రిక్తతను జోడించినట్లు లెక్క. ఆందోళనకు అడ్డుపడకుండా ఉండే అది అంతర్గత సంఘర్షణను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాడీ వ్యవస్థ కుదుటపడటానికి సహాయపడుతుందని అంటున్నారు.


బ్రేక్ తీసుకోవడం : ఒత్తిడి వలయంను ముందుగానే నిలువరించాలట. మనం తీసుకునే చిన్న బ్రేక్ కూడా ఈ వలయం తీవ్రం కాకుండా ఆపగలదు. ఈ క్రమంలో ఒత్తిడి సంకేతాలను ఎంత ముందుగా గమనిస్తే, స్పందన అంత సువుతుందని నిపుణులు సూచిస్తున్నారు.రోజువారీ అలవాట్లలో మార్పులు : రోజులో సురక్షితమైన క్షణాలను సృష్టించుకోండి. మన నాడీవ్యవస్థ నిరంతరం సంకేతాల కోసం వెతుకుతూ ఉంటుంది. ఏ విధమైన ఆటంకాలు లేకుండా కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం, కొద్దిసేపు నడవడం, నిరంతర సమాచార ప్రసారానికి దూరంగా ఉండటం క్రమం తప్పకుండా చేసినప్పుడు, చిన్న విరామాలు కూడా ఆందోళన నుంచి ఉపశమనానికి తోడ్పడతాయని నిపుణులు సలహా ఇస్తున్నారు.

ఒత్తిడిలో ఓ సాధారణ ధోరణ ఏమిటంటే, మనం అనుకున్న రీతిలో దాన్ని పరిష్కరించాలనుకోవడం. కానీ ఇది తరచుగా మరింత ఒత్తిడిని సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. ఆందోళన అనేది మానవ సహజమని, దాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు.

శరీరం సహజ ప్రతిస్పందన : ముప్పును పసిఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, గట్టినపుడు శరీరం సహజంగానే పోరాటమైనా చేస్తుంది లేదా పలాయన మార్గాన్ని ఎంచుకుంటుంది. ఆ సమయంలో

# తాళ్లపాకలో బ్రహ్మోత్సవ శోభ- అన్నమయ్యకు అక్షరాభ్యాసం చేసిన చెన్నకేశవ స్వామి ఆలయ విశేషాలు ఇవే!

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా, రాజంపేటకు 8 కి.మీ దూరంలో ఉన్న తాళ్లపాకలో శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం కలదు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలంగా ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. దాదాపు 32 వేల కీర్తనలు రచించిన అన్నమయ్య చెన్నకేశవ స్వామి భక్తుడు. అంతేకాదు అన్నమయ్య పూర్వీకులు సైతం ఈ స్వామి భక్తులే. అన్నమయ్యకు స్వామి వారు స్వయంగా అక్షరాభ్యాసం చేయించారని స్థానిక పురాణాలు చెబుతాయి. జులై 25, శనివారం నుంచి చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ చరిత్ర గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

**ఆలయ చరిత్ర**

తిరుపతికి దాదాపు 95 కి.మీ దూరంలో ఉన్న తాళ్లపాకలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రాలలో ఒకటిగా భాసిల్లుతోంది. ఈ దేవాలయం చారిత్రక ప్రసిద్ధి చెందినది. దేవాలయం వద్ద లభించిన శాసనాల ప్రకారం హైహవ వంశీయులు ఈ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తుంది. ఈ దేవాలయంలో చెన్నకేశవ స్వామిని త్రేతాయుగంలో కార్తవీర్యార్జునుడు ప్రతిష్ఠించినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తోంది.

**ఉత్తర వాహినిగా చంద్రవంక**

ఈ ప్రాంతంలో చంద్రవంక నది తన గమన దిశను మార్చుకుని ఉత్తరంగా ప్రవహించడం వలన ఈ నది ఉత్తర వాహిని అయ్యింది. అందుచేతనే ఈ ఆలయం మహిమాన్విత క్షేత్రంగా ప్రసిద్ధి పొందింది. శ్రీనాధుని పల్నాటి చరిత్రలో ఈ ఆలయం ప్రాధాన్యత గురించి వివరంగా వర్ణించి ఉంటుంది. శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రను ఈ ఆలయంలోనే రచించడం ప్రారంభించాడట. ఈ ఆలయంలో మంటప స్తంభాలు చోళ రాజుల కాలం నాటి శిల్పకళా శోభకు సాక్ష్యాలుగా నిలుస్తాయి.

**ఆలయ విశేషాలు**

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం ఆలయంలో కొలువై ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి నాలుగు చేతులలో శంఖు, చక్ర, గదా, అభయ హస్తాలతో భక్తులను అనుగ్రహిస్తున్నారు. అలాగే శ్రీకృష్ణుడు, సుదర్శన చక్రం, గోపాల స్వామి, ఆంజనేయ స్వామి వారి ఉపాలయాలను కూడా దర్శించుకోవచ్చు. ద్రావిడ నిర్మాణ శైలిలో అద్భుతంగా నిర్మితమైన ఈ ఆలయంలో నల్లరాతితో చెక్కిన సుదర్శన చక్రం, దాని కింద ఉన్న నవనీత కృష్ణుడు అంటే వెన్న ముద్ద పట్టుకున్న కృష్ణుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**అబ్బురపరిచే శిల్పకళా నైపుణ్యం**

దాదాపు 13 వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ దేవాలయ ప్రధాన ద్వారం వద్ద ధ్వజస్తంభం దీనిపై స్వామి విగ్రహం చెక్క, కంచుతో చేయబడి ఉంది. దేవాలయ గాలిగోపురం ముందు ధ్వజస్తంభం ప్రక్కన బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారి కళ్యాణానికి వినియోగించే కళ్యాణ మండపం ఉంది. ప్రధాన దేవాలయం ముందు బలిపీఠం ఉంది. బలిపీఠానికి దక్షిణం వైపు కప్పక స్తంభం, ఉత్తరాన గిలకల బావి ఉన్నాయి. గర్భగుడి ముందు ఉన్న రంగ మండపంలో నాలుగు రాతి స్తంభాలు ఉన్నాయి. వాటిపై శ్రీ మధ్భాగవతము, శ్రీమన్నారాయణ అవతారం, శ్రీ మహాభారతం, శ్రీమద్ రామాయణ గాథలు అద్భుతంగా చెక్కబడి ఉన్నాయి.

**కప్పక స్థంభం**

ప్రధాన ఆలయానికి వెలుపల గరుడ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించు సమయంలో దాని పై భాగం కొంత విరిగింది. ఆ విరిగిన భాగాన్ని దేవాలయ ఆవరణ లోపన ధ్వజస్తంభం పక్కన ప్రతిష్ఠించారు. దీనిని కప్పక స్తంభంగా పిలుస్తారు. దీని చుట్టూ ప్రదక్షణలు చేస్తే కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల విశ్వాసం.

**బ్రహ్మోత్సవాలు**

ప్రతి ఏటా ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి నుంచి 9 రోజుల పాటు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ ఏడాది జూన్ 25 శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

**బ్రహ్మోత్సవాల షెడ్యూల్**

శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు జూలై 24న అంకురార్పణతో శ్రీకారం చుడతారు. జులై 25 నుంచి ఆగస్టు 2 వరకు స్వామి, అమ్మవార్లు ప్రతిరోజూ వివిధ దివ్య వాహనాలపై మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శమిస్తారు. జూలై 30న సాయంత్రం 6 గంటలకు కల్యాణోత్సవం, ఆగస్టు 3న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం జరగనుంది.

**ఆధ్యాత్మిక అనుభూతి**

ప్రతిరోజూ వాహనసేవలు సందర్భంగా జరిగే భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి. చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు మనం కూడా తరలి వెళ్దాం. ఆధ్యాత్మిక అనుభూతిని అందుకుందాం.

ఓం శ్రీ చెన్నకేశవ స్వామినే నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# అయిదు రూపాల్లో వరదరాజ స్వామి దర్శనమిచ్చే ఉత్తిరామేరూరు క్షేత్రం- వివాహం కాని వారు ఒక్కసారి దర్శిస్తే కొద్దిరోజుల్లోనే!

తమిళనాట వరదరాజ స్వామి ఆరాధన విశేషంగా చేస్తారు. బ్రహ్మదేవుడు యజ్ఞం చేసినప్పుడు, ఆ యజ్ఞగుండం నుంచి శ్రీ మహా విష్ణువు వరదరాజస్వామిగా ఆవిర్భవించాడని పురాణాలు చెబుతున్నాయి. తమిళనాడుతో పాటు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా అక్కడక్కడా వరదరాజ స్వామి ఆలయాలను చూడవచ్చు. అయితే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కంచికి సమీపంలో వెలసి ఉన్న ఓ వరదరాజస్వామి ఆలయం చాలా ప్రత్యేకమైనది. మూడు అంతస్తుల్లో కొలువై ఉన్న ఈ ఆలయంలో అన్నీ విశేషాలే! ఈ ఆలయం ఎక్కడుంది? ఆ విశేషాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.ఉత్తిరామేరూరు – పంచ వరద క్షేత్రం – తమిళనాడుతమిళనాడులోని కాంచీపురంకు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో వెలసి ఉన్న ఉత్తరమేరూర్?లో కొలువై ఉన్న శ్రీ సుందర వరదరాజ పెరుమాళ్ ఆలయాన్ని "పంచ వరద క్షేత్రం" అని పిలుస్తారు. హిందూ పురాణాల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ క్షేత్రం 108 శ్రీ వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటిగా భాసిల్లుతోంది. పాండవులు తమ వనవాస సమయంలో ఈ క్షేత్రాన్ని దర్శించి, పూజించినట్లు చెబుతారు.

ఆలయ విశేషాలు

గర్భాలయంలో స్వామి సుందర వరదుడుగా, అమ్మవారు ఆనందవల్లి తాయారుగా పూజలందుకుంటున్నారు. ఈ ఆలయంలోని శిల్పకళా వైభవం అబ్బురపరుస్తుంది. మూడంతస్థుల్లో నిర్మించి ఉన్న ఈ ఆలయంలో వరదరాజస్వామి అయిదు రూపాల్లో పంచవరదుడిగా దర్శనమివ్వడం విశేషం. ఈ ఆలయ విశేషాలు ఇప్పుడు చూద్దాం.

మూడంతస్తుల ఆలయం


గర్భాలయంలో మూలమూర్తి ఆసీన, స్థానక, శయన భంగిమల్లో మూడు మూర్తులుగానూ దర్శనమిస్తాడు. ఈ ఆలయాన్ని పాండవులు అజ్ఞాతవాస కాలంలో సేవించుకున్నారట. పాండవులు పంచవరదులను, ద్రౌపది దేవి ఆండాళ్ తల్లిని పూజించారట.

సుందర వరద పెరుమాళ్

గర్భాలయంలో మూల విరాట్ "సుందర వరద పెరుమాళ్" శ్రీదేవి భూదేవి సమేతంగా చతుర్భుజాలతో తూర్పు ముఖంగా నిలుచుని ఉన్న భంగిమలో దర్శనమిస్తాడు. ఈ మూర్తిని ధర్మరాజు పూజించాడట. ఇది చాలా పెద్ద విగ్రహం.

అనిరుద్ధ వరద పెరుమాళ్

సుందర వరద పెరుమాళ్‌కి వెనుక భాగంలో గర్భాలయం బయట, ప్రాకారంలో "అనిరుద్ధ వరద పెరుమాళ్" ఉంటాడు. ఈయన్ను నకులుడు కొలిచాడట.



"అచ్యుత వరద పెరుమాళ్"

అదే ప్రాంగణంలో దక్షిణాభిముఖంగా అచ్యుత వరద పెరుమాళ్ కొలువై ఉన్నాడు. ఈ స్వామిని అర్జునుడు ఆరాధించాడు.

కల్యాణ వరద పెరుమాళ్

ఆలయ ప్రాంగణంలో ఉన్న మరో ఉపాలయంలో ఉత్తరాభిముఖంగా "కల్యాణ వరద పెరుమాళ్" ఆదిశేషుని మీద ఆసీనుడై దర్శనమిస్తాడు. ఈయనను సహదేవుడు సేవించుకున్నాడు. ఈ మూర్తిని సేవిస్తే వివాహ విషయంలో ఆటంకాలు ఏర్పడుతూ ఆలస్యం అవుతున్న వారికి అయిదు వారాల్లో వివాహం జరిగి తీరుతుందట.

ప్రదక్షిణ వలయంలోనే మూడు వరదరాజ పెరుమాళ్ ఆలయాలు

గర్భగుడిలో మూలమూర్తిని దర్శించుకుని బయటికి వచ్చిన తరువాత ప్రదక్షిణ మార్గంలో ముగ్గురు వరద మూర్తులు దర్శనమిస్తారు. గర్భాలయంలో స్వామితో కలిపి మొత్తం 4 వరదరాజ పెరుమాళ్ ఆలయాల దర్శనం ఇక్కడే పూర్తవుతుంది. గర్భగుడి చుట్టూరా ఒక్కొక్క స్వామికి చిన్న చిన్న ఉపాలయాల్లాగా వెలసి ఉండడం విశేషం.

ద్రౌపది సేవించిన ఆండాళ్

ఆలయ ప్రాకారంలోనే ద్రౌపదీ దేవి సేవించుకున్న ఆండాళ్ తల్లిని కూడా దర్శించుకోవచ్చు. ఆవిడే "ఆనందవల్లీ తాయారు". ఇక్కడే గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని కూడా దర్శించుకోవచ్చు.

రెండో అంతస్తులో అయిదో వరదరాజ పెరుమాళ్ఆలయంలోని రెండవ అంతస్తులో వైకుంఠ వరద పెరుమాళ్" సుఖాసీనుడై దర్శనమిస్తాడు. భీముడు పూజించిన మూర్తి ఈయనే అంట! రెండో అంతస్తులో ఈయనే ప్రధాన మూర్తి.ఇతర దేవి దేవతలు

ఇక ఇదే అంతస్తులో కృష్ణార్జునులు నరనారాయణులుగా వెలసి ఉన్నారు. అలాగే యోగ నరసింహ స్వామి, లక్ష్మీ వరాహ స్వామి కూడా దర్శనమిస్తారు. వరాహస్వామి ఎడమ తొడమీద లక్ష్మీదేవి ఆసీనురాలై దర్శనమిస్తుంది. అలాగే కృష్ణుడు చతుర్భుజాలతో అర్జునునికి గీతోపదేశం చేస్తున్న మూర్తిని కూడా దర్శించవచ్చు. రెండో అంతస్తులోని శ్రీ మహావిష్ణువు దశావతారాలు కూడా దర్శనమిస్తాయి.మూడో అంతస్తులు శేషతల్పంపై రంగనాథుడు

ఆలయం మూడో అంతస్తుకు చేరుకుంటే ఇక్కడ గర్భాలయంలో శేషశయనుడైన రంగనాథస్వామి దర్శనమిస్తాడు. ఈ స్వామి నాభి కమలంలో బ్రహ్మదేవుడు, పాదాల చెంత శ్రీదేవి, భూదేవి వెలసి ఉంటారు. ఇక్కడ రంగనాథుడు శయన భంగిమలో మార్కండేయుని ఆశీర్వదిస్తూ ఉండడం విశేషం.

తిరునామంతో శివయ్య!

రంగనాథ స్వామికి సమీపంలోనే తిరునామం ధరించిన శివయ్య కూడా దర్శనమివ్వడం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. 'శివుడు ఏమిటి? తిరునామం ఏమిటి?' అని ఆశ్చర్యపోయే వారికి ఇక్కడ శివుడు లింగ రూపంలో కాకుండా మూర్తి రూపంతో నుదుటన విభూతి పుండ్రాలు కాకుండా తిరునామం ధరించి దర్శనమిస్తూ శివకేశవ అభేధాన్ని ప్రస్ఫుటం చేస్తాడు.

గంగ యమునలే ద్వారపాలకులు

సాధారణంగా విష్ణువు ఆలయంలో ద్వార పాలకులుగా జయ విజయులు, శివాలయంలో సుమ్భనిషయంబులు శృంగి, భృంగి ఉండడం సహజం. కానీ ఇక్కడ మాత్రం ద్వారపాలకులుగా గంగా యమునలు ఉండడం విశేషం. ఈ క్షేత్రంలో ఇదో ప్రత్యేకత! ఇలా ఈ ఆలయంలో ప్రతిదీ ప్రత్యేకమే. రాజగోపురానికి ఎదురుగా ఒక చిన్న రామభక్త హనుమాన్ మందిరం వెలసి ఉంది. ఇక్కడ హనుమాన్ వీరాంజనేయ స్వామిగా పూజలందుకుంటున్నాడు.అబ్బురపరిచే శిల్పకళా వైభవం

పంచ వరద క్షేత్ర దర్శనంలో భాగంగా పంచ వరదులను దర్శించిన తరువాత ఆలయ శిల్పకళా వైభవాన్ని దర్శించవచ్చు. ఒక్కొక్క అంతస్తు ఎక్కుతుంటే పైకి వెళుతున్న కొద్దీ గోపురం, దానిమీద శిల్పాలు, విమానం మీద చెక్కిన శిల్పాలు అలనాటి శిల్పకళా వైభవాన్ని కళ్లకు కట్టుతాయి. ఈ ఆలయమే ఒక అద్భుతమైన శిల్పాల రాశి!

ఎలా చేరుకోవాలి?

ఆలయాల నగరి కంచి నుంచి కేవలం ఒక గంట ప్రయాణంతో ఈ పంచ వరద క్షేత్రానికి చేరుకోవచ్చు. అచ్యుతం కేశవం కృష్ణ దామోదరం. రామనారాయణం జానకి వల్లభం.

# వింధ్యవాసిని అమ్మవారి శక్తిపీఠం ఎక్కడుంది? శ్రీకృష్ణుడి సోదరిగా కొలువైన ఆ క్షేత్రం విశిష్టత, త్రికోణ దర్శనం గురించి తెలుసా?

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీర్జాపుర్ జిల్లాలో వింధ్య పర్వత శ్రేణుల్లో, పవిత్ర గంగానది ఒడ్డున వెలసిన వింధ్యవాసిని అమ్మవారి ఆలయం అత్యంత ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా భక్తుల విశ్వాసంలో ప్రత్యేక స్థానం పొందింది. దుర్గాదేవి స్వరూపంగా కొలువైన వింధ్యవాసిని అమ్మవారిని శ్రీకృష్ణుడి సోదరి యోగమాయగా కూడా పురాణాలు పేర్కొంటాయి. సతీదేవి శరీర భాగం పడిన ప్రదేశాలతో అనుసంధానమైన శక్తిపీఠ సంప్రదాయంలో వింధ్యాచల్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. వింధ్యవాసిని ఆలయంతో పాటు అష్టభుజ దేవి, కాళికా గుహ ఆలయాలను దర్శించే త్రికోణ యాత్ర కూడా ఈ క్షేత్రంలోని విశిష్టమైన ఆధ్యాత్మిక సంప్రదాయంగా భావిస్తారు. ఈ కథనంలో వింధ్యవాసిని శక్తిపీఠం స్థల పురాణం, యోగమాయగా అమ్మవారి అవతారం, ఆలయ విశేషాలు, త్రికోణ దర్శనం, పరిసరాల్లోని ముఖ్యమైన పుణ్యక్షేత్రాల గురించి తెలుసుకుందాం.



**శక్తిపీఠంగా**

గంగా నది ఒడ్డున మీర్జాపుర్ జిల్లాలో ఉన్న వింధ్యవాసిని దేవాలయం శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందింది. వింధ్యాచల్ అత్యంత ప్రసిద్ధి చెందిన శక్తివంతమైన పుణ్యక్షేత్రమని పురాణాలు వర్ణిస్తున్నాయి. దుర్గా సప్తశతి గ్రంథంలో కూడా ఈ పుణ్య క్షేత్రం గురించి గొప్పగా ప్రస్తావించి ఉంది. వింధ్యవాసిని ఆలయ విశేషాలు, స్థల పురాణం గురించి తెలుసుకుందాం.

**స్థల పురాణం**

వింధ్యవాసిని క్షేత్ర స్థల పురాణం ప్రకారం, వింధ్యాచల్ క్షేత్రంలో సతీదేవి ఎడమ చేతి బొటనవేలు పడిందని అంటారు. వింధ్యవాసిని అమ్మవారు దుర్గాదేవి దివ్య స్వరూపం. శివుడు సతీదేవి మృతదేహాన్ని భుజంపై వేసుకుని తాండవం చేస్తున్నప్పుడు, జగత్ కల్యాణం కోసం విష్ణుమూర్తి తన సుదర్శన చక్రంతో ఆమె శరీరాన్ని 51 భాగాలుగా ఖండించాడు. ఆ భాగాలు పడిన ప్రదేశాలే 51 శక్తిపీఠాలుగా మారాయి. ఆ క్రమంలోనే ఇక్కడ అమ్మవారి ఎడమ చేతి బొటనవేలు పడటం వల్ల ఇది అత్యంత పవిత్రమైన శక్తి పీఠాల్లో ఒకటిగా వెలిసింది. ఈ గుడిలో నిరంతరం చుక్క చుక్క నీరు కారుతూనే ఉండడం అంతుచిక్కని మిస్టరీగా మిగిలిపోయింది.

**ఈ క్షేత్రం మరో ప్రత్యేకత**

భాగవతం ప్రకారం, తన సోదరి దేవకీదేవి అష్టమ గర్భంలో జన్మించే పుత్రుని వలన కంసునికి ప్రాణగండం ఉంటుందని ఆకాశవాణి చేసిన హెచ్చరికతో దేవకీ వసుదేవులను కంసుడు చెరసాలలో బంధించి ఉంచుతాడు. పుట్టిన బిడ్డలను పుట్టినట్లే చంపసాగాడు. అయితే చెరసాలలో దేవకీదేవి అష్టమ గర్భంలో శ్రీకృష్ణుడు జన్మించగానే వసుదేవుడు ఆ పసి బాలుణ్ని బుట్టలో ఉంచుకుని యమునా నది దాటి గోకులానికి చేరుతాడు. అక్కడ అప్పుడే ఒక ఆడబిడ్డను ప్రసవించిన యశోద పక్కన చిన్ని కృష్ణుని ఉంచి ఆ ఆడపిల్లను తీసుకుని బయల్దేరి వస్తాడు. యధావిధిగా దేవకీ ప్రసవించిన బిడ్డను సంహరించడానికి వచ్చిన కంసుడు పుట్టినది ఆడపిల్ల అని కూడా చూడకుండా ఆ పసిపాపను గోడకేసి కొడతాడు. అప్పుడు ఆ పాప యోగమాయగా మారి కంసునితో 'నిన్ను సంహరించేవారు గోకులంలో పెరుగుతున్నాడు' అని చెప్పి మాయమవుతుంది.

**వింధ్యవాసినిగా యోగమాయ**

అక్కడ అంతర్ధానమైన ఆ యోగమాయ వింధ్యవాసినిగా వింధ్యాచల పర్వతంపై కొలువుదీరి పూజలందుకుంటోందని భాగవతం ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణుడి సోదరిగా పిలిచే ఈ దేవత ఆలయం శక్తిపీఠంగా, కోరిన కోర్కెలు తీర్చే పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

ఆలయ విశేషాలుఇతర శక్తిపీఠాల్లో కేవలం పడిన శరీర భాగాన్ని మాత్రమే పూజిస్తారు. కానీ వింధ్యాచల్‌లో మాత్రం అమ్మవారు పూర్ణ స్వరూపంతో అంటే విగ్రహ రూపంలో కొలువై ఉండి పూజలందుకోవడం విశేషం.

త్రికోణ దర్శనంవింధ్యాచల్?లో లక్ష్మి, కాళి, సరస్వతి రూపాలను పూజించే మూడు ప్రత్యేకమైన ఆలయాలు ఉన్నాయి. వీటిని దర్శించడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.

**అష్టభుజ ఆలయం**

వింధ్యవాసిని ఆలయం నుంచి 3 కిలోమీటర్ల దూరంలో కొండపై అష్టభుజ ఆలయం వెలసి ఉంటుంది. ఈ పుణ్యక్షేత్రానికి ప్రధాన దేవత అయిన దుర్గాదేవి అవతారమైన అష్టభుజ దేవి ఇక్కడ పూజలందుకుంటుంది. ఈ మందిరం ఉన్న కొండ వద్ద సీతా కుండ్, గెరువా తలాబ్, మొటియా తలాబ్ వంటి మూడు పవిత్రమైన చెరువులు ఉన్నాయి. పూర్వంలో రాజులు తమ ప్రత్యర్థులను, శత్రువులను నాశనం చేసేందుకు, అమ్మవారి ఆశీర్వాదం పొందేందుకు ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించేవారంట!

**కాళికా ఆలయం**

వింధ్యవాసిని ఆలయానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళికా గుహ మందిరంలో మహాకాళి దేవత పూజలందుకుంటుంది. ఇది అష్టభుజ ఆలయం ఉన్న కొండ దిగువన వెలసి ఉంటుంది.సీతా కుండ్శ్రీ వాల్మీకి రామాయణం ప్రకారం వనవాసం సమయంలో సీతాదేవి వింధ్యాచల్?లోని చెరువులో స్నానం చేసినట్లుగా తెలుస్తోంది. ఆ తరువాత కాలక్రమంలో ఈ ప్రాంతం సీతా కుండ్?గా ప్రసిద్ధి చెందింది. వింధ్యాచల్?లో తప్పక చూడాల్సిన ప్రదేశాల్లో ఇది ఒకటి.

**రామేశ్వర్ మహాదేవ్ ఆలయం**

రామ్ గయ ఘాట్?లో ఉన్న రామేశ్వర్ మహాదేవ్ ఆలయం వింధ్యవాసిని ఆలయానికి కిలోమీటరు దూరంలో ఉంటుంది. పురాణాల ప్రకారం వశిష్ఠ మహర్షి ఆదేశానుసారం శ్రీరాముడు మరణించిన తన తండ్రి జ్ఞాపకార్థం ఈ ప్రదేశంలో శివలింగాన్ని ప్రతిష్టించినట్లుగా తెలుస్తోంది.

ఎలా చేరుకోవాలి?

వింధ్యాచల్ ప్రముఖ పుణ్యక్షేత్రం వారణాసి నుంచి 63 కి.మీ దూరంలో, అలహాబాద్‌కు సమీపంలో ఉంది. ఇటు వారణాశి నుంచి, అటు మీర్జాపూర్ నుంచి, అలహాబాద్ నుంచి కూడా వింధ్యాచల్?కు రోడ్డు మార్గంలో సులభంగా చేరుకోవచ్చు. వింధ్య పర్వతంపై వెలసివున్న ఈ పుణ్యక్షేత్రం సందర్శన భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆహ్లాదాన్ని కూడా పంచుతుంది. ముఖ్యంగా పర్వతారోహకులు పర్వతారోహణ అనుభవంతో పాటు వింధ్యవాసిని ఆశీర్వాదాన్ని కూడా పొందుతారు.

# స్వయం సహాయక సంఘాలకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్

- 10 మంది నిబంధన సడలింపు
- 8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్ లబ్ధి
- పొదుపు సంఘాలకు సులభంగా బ్యాంక్ రుణాలు
- ఏపీ గ్రామీణ బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు
- ఇతర బ్యాంకులూ అనుసరించాలని మంత్రి పిలుపు




**అమరావతి, ఆగస్టు 13 :** స్వయం సహాయక సంఘాల (డ్వా+ం) మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10 కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్ డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని... ఈ క్రమంలోనే ఏపీ గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని... అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు... అక్రమాలు లేకుండా.. పాత బకాయిలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. అర్హత గల సంఘాలు ప్రత్యేక తీర్మానం మరియు బాధ్యతా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. రుణ సడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు. మహిళలకు ఇచ్చే రుణం ఒక ఆర్థికసాయం మాత్రమే కాదని.. వారి జీవనోపాధి, స్వయం ఉపాధికి, మహిళల ఆర్థిక సాధికారతకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి, ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదే రీతిలో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్బీసీ) మరియు రాష్ట్రంలో ఉన్న ఇతర బ్యాంకులు కూడా ముందుకు వచ్చి, మంచి రికార్డు ఉన్న స్వయం సహాయక సంఘాలకు 10 మంది నిబంధనను సడలించి, సులభంగా రుణ పునరుద్ధరణ సహాయం అందించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# వత్సవాయిలో రేపు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

**- జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి**

**.: జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ: ఆగస్టు 13,2026:** "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆగస్టు 14వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.వత్సవాయి శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ కోరారు.

# లేక్ వ్యూ పార్క్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ

**ట్రాఫిక్ ఏర్పాట్లను సమీక్షించిన డిసిపి అవినాష్ కుమార్**







**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్) :** నెక్లెస్ రోటరీ సమీపంలోని లేక్ వ్యూ పార్క్ వద్ద శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డిసిపి అవినాష్ కుమార్, గురువారం లేక్ వ్యూ పార్క్‌ను సందర్శించి ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డిసిపి అవినాష్ కుమార్‌తో పాటు ట్రాఫిక్-1 అదనపు డిసిపి ఎ. రాములు, ఖైరతాబాద్ జోన్ ట్రాఫిక్ ఎసిపి ఎస్. మోహన్ కుమార్ పాల్గొంటారు.ఈ సందర్భంగా అధికారులు వేదికతో పాటు దాని పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగే సమయంలో సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వాహనాల రాకపోకలు సునాయాసంగా సాగేలా చూసేందుకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు వాహనాల మళ్లింపు (ట్రాఫిక్ డైవర్షన్) ప్రణాళికలు, పార్కింగ్ నిర్వహణ మరియు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడానికి సిబ్బందిని కేటాయించడంపై క్షేత్రస్థాయి అధికారులకు సవివరమైన సూచనలు జారీ చేశారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

- ఆగస్టు 14న విజయవాడలో కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్
- ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హతతో 18 నుంచి 29 ఏళ్లలోపు యువతీ యువకులకు అవకాశం

**విజయవాడ: ఆగస్టు 13, 2026.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆగస్టు 14,2026 శుక్రవారం కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అధికారి సి.మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు.ఆగస్టు 14న ఉదయం 9.00 గంటలకు విజయవాడ గాయత్రీ నగర్‌లోని ఆధ్యా స్టోర్, పాత ఎస్బిఐ బ్రాంచ్, జూడియో స్టోర్స్ ఎదురుగా, ఘంటసాల వారి స్ట్రీట్ నందు కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ డ్రైవ్‌కు హాజరయ్యే అర్హత కలిగిన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధుల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ ఉద్యోగ అవకాశాలకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ విద్యార్హత కలిగి, 18 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాలలోపు వయస్సు గల యువతీ యువకులు అర్హులని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించే అవకాశం ఉందని వెల్లడించారు. ఆసక్తి మరియు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్‌కు హాజరయ్యే ముందు నైపుణ్యం పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో నమోదు చేసుకోవడానికి:కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు రెజ్యూమ్ లేదా బయోడేటా ఫారంతో పాటు కింది పత్రాల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని అధికారులు సూచించారు: ఆధార్ కార్డు కాపీ, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్, పాన్ కార్డు కాపీ, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెజ్యూమ్ లేదా బయోడేటా.జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అధికారులు కోరారు. ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు నిర్ణీత సమయానికి అవసరమైన పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 81259 73743, 99857 59304, 93477 79032 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# అంగన్వాడి కేంద్రాలు చిన్నారులకు మంచి భవిష్యత్తును అందించాలి

- పౌష్టికాహార లోపం లేకుండా చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- వయసుకు తగ్గ బరువు లేని పిల్లలపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ







**జగ్గయ్యపేట: ఆగస్టు 13,2026.** అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పునాదిగా నిలిచి, వారికి మంచి భవిష్యత్తును అందించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వయసుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గురువారం జగ్గయ్యపేట మండలం ధర్మవరపుపాడు తండా సక్షం అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలు, పౌష్టికాహార కార్యక్రమాల అమలు, విద్యాబోధన, ఆటపాటల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రానికి అందజేసిన టీవీ, ఆర్వో ప్లాంట్, పెయింటింగ్స్, ఆట వస్తువులు తదితరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాటిని చిన్నారుల అవసరాలకు అనుగుణంగా సక్రమంగా వినియోగిస్తున్నారా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమాలు, చిన్నారులకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వయసుకు తగ్గ బరువు లేని చిన్నారుల వివరాలను సంబంధిత యాప్‌లో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యాప్‌లో నమోదైన వివరాలకు అనుగుణంగా చిన్నారుల బరువును స్వయంగా తూయించి క్రాస్ చెక్ చేశారు. పిల్లల ఎదుగుదల, బరువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో జిల్లా కలెక్టర్ కొద్దిసేపు సరదాగా ముచ్చటించారు. వారు నేర్చుకున్న పాటలను చిన్నారులతో పాడించి, వారిని ఉత్సాహపరిచారు. ఆటపాటల ద్వారా పిల్లల్లో ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందేలా అంగన్వాడి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, చిన్నారుల బాల్య దశలో ఆటపాటలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ వయసులో పిల్లలకు ఆటలు, పాటలు, విద్యాబోధనను సమన్వయం చేస్తూ అందిస్తే వారు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల్లో సృజనాత్మకత, నేర్చుకునే ఆసక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించే కేంద్రాలుగా పనిచేయాలని సూచించారు. వయసుకు తగ్గ బరువు లేని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాంటి పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు, వారి తల్లిదండ్రులకు కూడా పిల్లలకు అందించాల్సిన పోషకాహారం, సమతుల్య ఆహారం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత, పరిమాణం, పంపిణీ తదితర అంశాలను పర్యవేక్షించాలని, బాలామృతం సక్రమంగా అందిస్తున్నారా లేదా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అం గన్వాడి కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. పర్యావరణ పరిర క్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమ ంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ పి.మనోహర్, ఎంపీడీవో, సీడీపీఓ జి.సత్యవతి, పాల్గొన్నారు.

# నేడు జి ఎస్ బి చారిటబుల్ ట్రస్ట్ సన్నాహక సమావేశం

**కామవరపుకోట: ఆగస్టు 13** మండలంలోని తడికలపూడి పంచాయతీ శివారు రత్నగిరి నగర్ లో జీఎస్ బి చారిటబుల్ ట్రస్ట్ సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ గూడూరు వి ఎస్ ఆర్ ప్రసాద్ (ఇంజనీర్) తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రంలోనే మరి ఎక్కడా లేని విధంగా తొలిసారిగా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం వసతి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## పోలీసుల స్వాధీనంలో ఉన్న 2,193 వాహనాలకు ఆరు నెలల్లోగా క్లెయిమ్ చేసుకోండి

## నగర పోలీస్ కమిషనర్

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 13 (పీపుల్స్ న్యూస్) :** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో జప్తు చేసిన, రోడ్లపై వదిలేసిన (అనాథ/యాజమాన్యం లేని) విభిన్న రకాలకు చెందిన మొత్తం 2,193 వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు పోలీస్ శాఖ నిర్ణయించింది. 'హైదరాబాద్ (మెట్రోపాలిటన్ ఏరియా) పోలీస్ యాక్ట్ 2004' సెక్షన్ 7 'హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్' సెక్షన్ 40 కింద లభించిన అధికారాల మేరకు ఈ వేలం ప్రక్రియను నిర్వహించనున్నారు.ఈ వాహనాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, లేదా వాహన యాజమాన్య హక్కులు, ఫైనాన్స్/హైపోథికేషన్ క్లెయిమ్‌లు ఉన్నవారు సంబంధిత ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ ప్రకటన విడుదలైన తేదీ నుండి ఆరు నెలల వ్యవధిలో బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో ఉన్న సిటీ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు సమర్పించి తమ వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోరని, ఆ వాహనాలను వేలం వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.వేలానికి సిద్ధంగా ఉన్న వాహనాల పూర్తి వివరాలు అంబర్‌పేట్ పోలీస్ ఆసుపత్రి వెనుక ఉన్న సాూ= ఖూా పోలీస్ గ్రౌండ్స్‌లోని 'ఆక్షన్ టీమ్' వద్ద అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ ష్ఛష్ఛ.ఫ్ట్రఎవతీఖఎజాశీ-శ్రీఅఎవ.స్త్రశీజ.ఱఅ లో కూడా ఈ వివరాలను పరిశీలించవచ్చని ప్రకటనలో తెలిపారు

శుక్రవారం,
ఆగస్టు 14, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# దశాబ్దాల ప్రజాస్వామ్యంలోనూ అసంపూర్ణ సామాజిక న్యాయం

### - పెట్టుబడిదారీ విధానాలకు కళ్లెం వేయాలి
### - ప్రధానికి శిరిగిరి వరదరాజు బహిరంగ లేఖ
### ప్రభుత్వ రంగ బలోపేతం, రైతు సంక్షేమే దేశ భవిష్యత్తు



**శ్రీకాకుళం:** "పుష్కర కాలం పాలించినా సామాన్యుడి కన్నీరు ఆరకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటి?" అంటూ నవచైతన్య యువజన సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ శిరిగిరి వరదరాజు ప్రధాని నరేంద్ర మోడీకి బహిరంగ లేఖ రాశారు. దేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడి ఎనిమిది దశాబ్దాలు నిండుతున్న తరుణంలో కూడా అర్హత ప్రామాణికంగా కొన్ని వర్గాలకు న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకే చట్టం – ఒకే ధర్మం – ఒకే న్యాయం" అనేది ఇప్పటికీ కాగితాలకే పరిమితమైందని, కోట్లాది మంది సమన్యాయం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నేడు దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బలంగా పావులు కదుపుతోందని, దీనిని అరికట్టకపోతే ప్రజాస్వామ్య ఉనికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. సామాన్య మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చిన ప్రధాని మోడీ ఈ వాస్తవాలను గుర్తించి దేశంలో ప్రశాంత వాతావరణం కోసం ప్రాధాన్యత కల్పించాలని కోరారు. స్వాతంత్ర దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనందమే అయినా, ఆ స్వాతంత్ర లక్ష్యాలను నెరవేర్చడంలో పాలకులకు చిత్తశుద్ధి లోపిస్తోందని విమర్శించారు. "ప్రచారానికి స్వాతంత్ర దినం కాదు, ఫలితాల కోసం స్వాతంత్ర దినం కావాలి" అని ఆయన అన్నారు. స్వాతంత్ర తొలి నాళ్లలో ఉన్న నిబద్ధత, నిజాయితీ నేడు కరువైందని, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు శృతి మించాయని ఆరోపించారు. జాతి ప్రయోజనాల కోసం నిర్మించే కట్టడాలు, రోడ్లు, భవనాలు నాణ్యత లేక సంవత్సరాలలోపే శిథిలమవుతున్నాయని, ఇది ప్రజాధన దుర్వినియోగానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ రంగం బలహీనపడిందని, భారతదేశంలో పుష్కలంగా ఉన్న మానవ వనరుల వినియోగం, నిరుద్యోగ సమస్య పరిష్కారం ప్రభుత్వ రంగం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. దీర్ఘకాలం సేవ చేసి పదవీ విరమణ చెందిన ఉద్యోగులు, వాలంటరీ తీసుకున్న వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం క్షీణిస్తున్న నేపథ్యంలో నేషనల్ వైడ్ కల్టివేషన్ కార్పొరేషన్ ఏర్పాటు, ధరల స్థిరీకరణ, పద్దెనిమిది నుండి డెబ్బై ఏళ్ల రైతులకు ప్రభుత్వ ఇన్సూరెన్స్ తప్పనిసరి అని సూచించారు. "ఓటు అనేది ప్రజాస్వామ్య వజ్రాయుధం" అని, కానీ నేడు చాలా మంది పౌరులు ఓటు హక్కును కూడా పొందలేని దుస్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖులు తీసుకునే వేల కోట్ల అప్పుల మాఫీని అరికట్టి, సామాన్యుడికి బ్యాంకు సేవలు అందేలా చూడాలని, పిపిపి విధానం ద్వారా వ్యవస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని నివారించాలని కోరారు. పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయస్థాయిలో పెన్షన్, ఆరోగ్య పరిరక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న స్వాతంత్ర దినోత్సవం నాటికైనా న్యాయం జరగని వర్గాలకు న్యాయం చేస్తేనే అది నిజమైన స్వాతంత్ర వేడుక అవుతుందని శిరిగిరి వరదరాజు ఆకాంక్షించారు.

# క్షుద్ర పూజలకు అడ్డువచ్చాడని బీటెక్ విద్యార్థి కిడ్నాప్ - ముగ్గురు మాంత్రికుల అరెస్ట్



**కడప:** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తిరుపతి జిల్లాకు చెందిన కాణిపాకం విజయకుమార్, చిత్తూరు జిల్లాకు చెందిన కరణం బాల హేమనాథ్, కర్ణం బాలసుబ్రమణ్యం అనే ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి కొంతకాలంగా క్షుద్ర పూజలు చేస్తున్నారు. గుప్తనిధులు సాధించాలనేది వీరి ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలోనే అనంతపురం జిల్లాకు చెందిన ఓ మైనర్ బాలిక తండ్రితో వీరు పరిచయం పెంచుకున్నారు. క్షుద్ర పూజల్లో అతని కూతురిని కూర్చోబెడితే భారీగా డబ్బులు వస్తాయని ఆయనికి ఆశ చూపించారు. తండ్రి అంగీకారంతో ఆ బాలికను నగ్నంగా కూర్చోబెట్టి ఈ ముగ్గురు నిందితులు పూజలు చేశారు. కడపకు మకాం మార్పు : బాలికతో పూజలు చేసినప్పటికీ వారికి ఎలాంటి ఫలితం దక్కలేదు. దీంతో తమ వ్యూహాన్ని మార్చారు. గుప్తనిధుల గురించి ఆరా తీసే క్రమంలో కడపకు చెందిన మరో క్షుద్ర మాంత్రికుడు వెంకటేశ్? యాదవ్‌ను ఈ ముగ్గురూ సంప్రదించారు. ఓ మైనర్ బాలికను తీసుకొచ్చి పూజలో కూర్చోబెడితే గుప్త నిధులు దొరుకుతాయని అతనికి చెప్పారు. అయితే, తాను ప్రస్తుతం ఊర్లో లేనని, ఆ తర్వాత రమ్మని వెంకటేశ్? వారికి బదులిచ్చాడు. అడ్డువచ్చిన బీటెక్ విద్యార్థి : వెంకటేశ్? యాదవ్ లేకపోవడంతో నిందితుడు విజయ్ కుమార్ కడప జిల్లా వల్లూరు మండలంలోని తనకు తెలిసిన భాగ్యలక్ష్మి అనే మహిళ ఇంటికి వెళ్లాడు. ఆ మైనర్ బాలికను కూడా అక్కడికే తీసుకువెళ్లారు. అక్కడ ఆ ముగ్గురు నిందితులు గుప్తనిధుల కోసం చర్చించుకుంటున్నారు. అదే సమయంలో భాగ్యలక్ష్మి కుమారుడు, బీటెక్ చదువుతున్న ప్రణవ్ అక్కడికి వచ్చాడు. మీరంతా ఇక్కడ ఏం చేస్తున్నారని వారిని ఆరా తీశాడు. వారు గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేస్తున్నారనే విషయాన్ని ప్రణవ్ పసిగట్టాడు. వెంటనే వారితో వాగ్వాదానికి దిగాడు. ఈ పనులు ఇక్కడ చేయడానికి వీల్లేదని అడ్డుకున్నాడు.
కారులో కిడ్నాప్ : ప్రణవ్ అక్కడే ఉంటే తాము క్షుద్ర పూజలు చేయలేమని ఆ ముగ్గురు నిందితులు భావించారు. తమకు అడ్డుగా ఉన్న అతడిని అడ్డుతొలగించుకోవాలని పథకం పన్నారు. ప్రణవ్‌ను బలవంతంగా బయటికి లాక్కెళ్లారు. తమ కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అతని కాళ్లు, చేతులు కట్టేసి, కత్తులతో బెదిరించారు. అయితే, ప్రాణభయంతో ప్రణవ్ గట్టిగా కేకలు వేశాడు. దీంతో భయపడిన నిందితులు అతడిని అక్కడే వదిలేసి పారిపోయారు. ఈ ఘటన నుంచి ప్రాణాలతో బయటపడిన ప్రణవ్, వెంటనే వల్లూరు పోలీసులను ఆశ్రయించాడు. తనకు జరిగిన ప్రాణహానిపై ఫిర్యాదు చేశాడు. ప్రణవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న ఆ ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. "గుప్తనిధుల కోసం క్షుద్ర పూజలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశాం. మైనర్ బాలికను పూజలకు వాడుకుంటున్న విషయాన్ని పసిగట్టి, వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ప్రణవ్ అనే బీటెక్ విద్యార్థిని వీరు కిడ్నాప్ చేశారు. కారులో తీసుకెళ్లి కాళ్లు, చేతులు కట్టేసి కత్తులతో బెదిరించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాం. ముగ్గురు నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం కింద కేసులు నమోదు చేశాం. వారి వద్ద నుంచి ఒక కారు, ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నాం."

# దేశభక్తి భావాన్ని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలి

- జాతి కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి
- జాతీయ సమైక్యత, దేశంపై మమకారాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలి
- చిల్లకల్లు జడ్పీ పాఠశాల విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ











**జగ్గయ్యపేట: ఆగస్టు 13, 2026.** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ భావితరాల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి, దేశంపై మమకారాన్ని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు జడ్పీ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చిల్లకల్లు జడ్పీ పాఠశాల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా కదిలారు. విద్యార్థులు, యువత, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు. జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు క్రమశిక్షణతో ర్యాలీలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు, "భారత్ మాతా కీ జై", "వందేమాతరం" వంటి నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల సేవలను, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. వారి త్యాగ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి, దేశంపై మమకారం, బాధ్యతాయుత పౌరస్ఫూర్తి మరింతగా పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, జాతీయ పతాకం ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేవలం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి ఇంటిలోనూ దేశభక్తి స్ఫూర్తిని నింపేలా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాపై గౌరవాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. దేశభక్తి గేయాలు ఆలపిస్తూ, జాతీయ నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తి, క్రమశిక్షణ, ఐక్యతా భావాలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ పి. మనోహర్, ఎంపీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలినో ప్రభావాన్ని అందరం కలిసికట్టుగా ఎదుర్కొందాం

- నూరు శాతం పంటల బీమా చేయించేందుకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- ఆగస్టు 15తో పంటల బీమా నమోదు గడువు ముగింపు
- ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ







**జగ్గయ్యపేట: ఆగస్టు 13, 2026.** ఎలినో ప్రభావాన్ని అందరం కలిసికట్టుగా ఎదుర్కొంటూ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంటల బీమా ద్వారా రైతులకు భరోసా కల్పించేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జగ్గయ్యపేట వ్యవసాయ శాఖ అధికారులు గురువారం ధర్మవరప్పాడు తండా జెండా చెట్టు వద్ద ఏర్పాటుచేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాల్గొన్నారు. మీ సందర్భంగా చెట్టు కింద కూర్చుని రైతులతో ముచ్చటించారు. రైతుల సాగు పరిస్థితులు, నీటి లభ్యత, పంటల సాగు, ఎరువుల లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా నెలకొన్న ఎలినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని రైతులకు వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు పంటల సాగులో వైవిధ్యాన్ని పాటించాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఉద్యానవన పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు పద్ధతులు, నీటి వినియోగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవసరమైన సలహాలు అందించాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీతో ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ నమోదు గడువు ముగియనున్నందున, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ముఖ్యంగా వరి, మిర్చి, పెసర, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులం దరూ క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. పంటలకు అనుకోని నష్టం సంభవించినప్పుడు బీమా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంటల బీమా కల్పించేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బీమా నమోదు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు బీమా నమోదు ప్రక్రియ, గడువు తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని సందర్శించారు. రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా జరుగుతున్న ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించి, రైతులకు ఎరువులు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిబంధనల ప్రకారం ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా జరుగుతున్న ఎరువుల పంపిణీ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఎరువుల లభ్యత, పంపిణీ ప్రక్రియపై రైతులకు అవసరమైన సమాచారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, జగ్గయ్యపేట ఏడీఏ సి.భవాని, డిప్యూటీ తహసిల్దార్ పి.మనోహర్, డిప్యూటీ ఎంపీడీవో, ఆర్ఎస్కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయండి




**అమరావతి:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఈవో, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాలన్నారు. మ్యాపింగ్ చేయని ఓటర్లు, లోపాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, విచారణలు పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. 'బుక్ ఎ కాల్' పెండింగ్ అంశాలు, ఎన్‌జీఎస్పీ (బీ+టూ) ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లాల అధికారులను ఆదేశించారు. ఆగస్టులో ప్రత్యేక ప్రచారం: ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో 'ప్రత్యేక ప్రచార దినాలు' నిర్వహించనున్నట్లు సీఈఓ వెల్లడించారు. ఈ నిర్ణీత ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), రాజకీయ పార్టీల ప్రతినిధులు (బీఎల్‌ఏలు) పోలింగ్ కేంద్రాల్లోనే స్వయంగా అందుబాటులో ఉండి పౌరులకు ఓట్ల నమోదు, ఫారమ్‌ల పూర్తిపై మార్గదర్శకత్వం వహిస్తారని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ఈ ప్రక్రియను పారదర్శకంగా ముగించాలన్నారు.

# శ్రీలంక పర్యటనలో పడిక్కల్ చెలరేగుతాడు

**• మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం**



శ్రీలంక పర్యటనలో టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చెలరేగుతాడని మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం చెప్పాడు. శ్రీలంక కండిషన్స్ అతని బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సాయి సుదర్శన్ గాయంతో ఈ పర్యటనకు దూరమవడంతో పడిక్కల్‌కు మార్గం సుగుమమైంది. అంతేకాకుండా వామప్ మ్యాచ్‌లో అతను అద్భుతమైన శతకంతో చెలరేగాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన రహానే.. పడిక్కల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గురించి ఆలోచించకుండా.. టెస్ట్ సిరీస్‌పై ఫోకస్ పెట్టాలని సూచించాడు. శ్రీలంక జట్టును ఏ మాత్రం తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించాడు. 'శ్రీలంక కండిషన్స్ దేవదత్ పడిక్కల్‌కు సరిగ్గా సరిపోతాయి. అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు కాబట్టి.. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఒకసారి క్రీజులో కుదురుకున్న తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అతను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. ఫ్రంట్ ఫుట్, బ్యాక్ ఫుట్ షాట్స్‌తో అతని వద్ద పూర్తి స్థాయి బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. అయితే మూడో స్థానంలో ఆడే బ్యాటర్ ముందు చూపుతో ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మూడో స్థానం బ్యాటర్ రాణిస్తే.. జట్టు మొత్తం ఆధిపత్యం చెలాయించగలదు. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ అతను మంచి రిథమ్‌లో కనిపిస్తున్నాడు. అతను తన ఫామ్, రిథమ్ నమ్ముకొని ఆడాలి. తనపై తాను అనవసర ఒత్తిడి పెంచుకోకుండా ఉండటం ముఖ్యం. అతనికి పరుగులు ఎలా చేయాలో తెలుసు. స్పిన్నర్లపై కట్, స్వీప్, స్టెప్ ఔట్ షాట్స్‌తో ఎదురుదాడి చేయగలడు.'అని రహానే చెప్పుకొచ్చాడు. భారత్ డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించి శ్రీలంకను తేలికగా తీసుకోకూడదని రహానే హెచ్చరించాడు. 'డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీలంకను తేలికగా తీసుకోకూడదు. భారత్ ముందుగా తొలి టెస్ట్ గెలవడంపై ఫోకస్ పెట్టాలి. ఆ తర్వాతే రెండో టెస్టు గెలిచి 2–0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గురించి ఆలోచించాలి. కీలకమైన క్షణాలను గుర్తించి ఆధిపత్యం చెలాయిస్తేనే సిరీస్ కైవసం అవుతుంది. ఈ సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఎందుకంటే టెస్ట్‌ల్లో బాగా రాణించాలనే కసితో శ్రీలంక కూడా ఉంది. ఈ సిరీస్ ఏ మాత్రం ఏకపక్షంగా ఉండదని నేను భావిస్తున్నా.'అని అజింక్యా రహానే అన్నాడు.

# గంభీర్‌కు అండగా నిలిచిన హర్భజన్ సింగ్



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అండగా నిలిచాడు. టీమిండియా వైఫల్యానికి గంభీర్‌ను బాధ్యుడిని చేస్తూ అతనిపై విమర్శలు గుప్పించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషని, అందుకే అతన్ని నిర్ణయాలు నచ్చడం లేదని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. గంభీర్ కోచింగ్‌లో భారత జట్టు ఐసీసీ టోర్నీలు గెలిచిందని గుర్తు చేశాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శనివారం నుంచి గాలే వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. అయితే గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ క్రమంలోనే అతని కోచింగ్ తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. శ్రీలంకతో సిరీస్‌కు ముందు మాట్లాడిన హర్భజన్ సింగ్.. గంభీర్‌ను వెనకేసుకొచ్చాడు. 'గౌతమ్ గంభీర్ ఎందుకు ఇంతలా ఎందుకు విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే అతన్ని నిదించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. గంభీర్ క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఆట పట్ల చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ ఆరంభంలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతనికి మంచి ఫ్రెండ్స్. ఇప్పటికీ వారే స్నేహితులనుకుంటా. అతను ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడుతాడు. అందుకే అతని నిర్ణయాలు కొందరికి నచ్చవు. కవర్ చూసి పుస్తకం ఎలాంటిదో చెప్పకూడదని పెద్దలు అంటారు. గంభీర్‌ను విమర్శించడం కూడా తప్పే. గెలుపు కోసమే ఆడాలని నమ్మే కోచ్ అతను. ఓటమిని ఏ మాత్రం జీర్ణించుకోడు. డ్రా కోసం ఆడేందుకు అస్సలు ఇష్టపడడు. శుభ్‌మన్ గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. అతను గొప్ప ఆటగాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా బ్యాటర్‌గా సత్తా చాటాడు. ఫుట్‌బాల్‌లో లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఆడుతున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో ఆడితే తప్పేంటి? ఏ ఆటగాడికైనా సరే ప్రదర్శనే కొలమానం. వయసు ముఖ్యం కాదు. విరాట్ కోహ్లీ 37 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల కుర్రాడిలా మైదానంలో చురుకుగా ఉంటాడు. భారత జట్టులో కోహ్లీ.. మెస్సీ లాంటి ప్లేయర్. భారత జట్టులో ఫిట్‌నెస్ విప్లవం తెచ్చింది అతనే. చివరి రోజు 400 పరుగుల లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ మెరుగ్గా రాణిస్తున్నారు. కాబట్టి వారిని వన్డేల్లో కొనసాగించాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

# కేఎల్ రాహుల్ మా ఎక్స్‌ఫ్యాక్టర్..

**• టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్**



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నదమైంది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను 2–0తో క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. ఈ క్రమంలో ఈ సిరీస్‌ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. అయితే ఈ సిరీస్‌లో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తమ ఎక్స్‌ఫ్యాక్టర్ అని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మోర్కెల్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందని, అది జట్టుకు ఉపయోగపడుతుందని తెలిపాడు.'టెస్ట్‌ల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. శ్రీలంక కండీషన్స్, పిచ్‌లపై అతనికి అపారమైన అనుభవం ఉంది. అతనికి ఉన్న ఈ అనుభవం యువ ఆటగాళ్లకు ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎంతగానో ఉపయోగపడింది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా మా ప్లేయర్స్ వ్యక్తిగతంగా తమ ఆటను ఎంతో మెరుగుపరుచుకున్నారు. ఈ సిరీస్‌ను గెలవడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేశాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ తెలిపాడు. గాలె పిచ్ కండిషన్స్ పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఓవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే.. మరో వైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకు రాగలరని తెలిపాడు. 'గాలే పిచ్ చూడటానికి మంచి వికెట్‌లా కనిపిస్తోంది. కానీ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌లో మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నా. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే విధంగా మేం సిద్ధమయ్యాం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి మాకు కావాల్సింది మానసిక బలం, బ్యాటింగ్‌లో సమయం, బౌలింగ్ స్పెల్స్ వేయడం, బంతిని సరైన ప్రదేశంలో వేయడం వంటివి.'అని ఇయాన్ మోర్గాన్ చెప్పుకొచ్చాడు. బ్యాటింగ్ పరంగా టీమిండియా బలంగానే ఉన్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా దూరమవ్వడం పెద్ద లోటు కాగా.. జట్టులో ఉన్న ఆటగాళ్లంతా శ్రీలంక పర్యటనకు కొత్త కావడం మరో విశేషం. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మినహా శ్రీలంక పర్యటనలో టెస్ట్ సిరీస్ ఆడిన అనుభవం మరే ఆటగాడికి లేకపోవడం గమనార్హం.

# భారత్‌తో టెస్ట్‌కు శ్రీలంక జట్టు ప్రకటన

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్‌వెల్లాకు పిలుపు దక్కింది. 2023లో శ్రీలంక తరఫున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది. ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్–ఏ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది. భారత్‌తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్:ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ద్రువాల్నాండో, ఎఫ్‌సి ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.




# తొలి టెస్ట్‌లో స్నికో వివాదంపై దుమారం

ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో స్నికో వివాదం తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ సాయంతో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బంగ్లాదేశ్ యువ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.అయితే ఇన్నింగ్స్ ఆరంభంలోనే అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టెక్నాలజీ సాయంతో బచాయించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎబాడోట్ హొస్సేన్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి స్టీవ్ స్మిత్ బ్యాట్‌కు దగ్గరగా వెళ్తూ కీపర్ చేతిలో పడింది. దాంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వికెట్ కోసం అప్పీల్ చేశారు. స్మిత్ కూడా ఔటేనని భావించి పెవిలియన్ వైపు నడిచాడు. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన ఔటివ్వకపోవడంతో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పైక్ కనిపించలేదు. దాంతో స్మిత్ తిరిగి బ్యాటింగ్ చేపట్టాడు. అయితే ఈ నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. టెక్నాలజీలో లోపం ఉందని నెటిజన్లు ఆరోపించారు. ఆస్ట్రేలియా ఛీటింగ్ చేసిందని మండిపడ్డారు.తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో ఈ ఘటనపై స్మిత్ స్పందించాడు. తాను ఔటనే భావించానని, కానీ బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదన్నాడు. 'నేను ఔటయ్యాననే భావించాను. నేను చాలా అదృష్టవంతుడిని. టెక్నాలజీనే నన్ను కాపాడింది. ఒకవేళ అంపైర్ ఔటిచ్చి ఉంటే నేను వెళ్లిపోయేవాడిని. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. అయితే బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయాన్ని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ బ్యాట్‌కు తాకినట్లు నాకు అనిపించింది.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు.




# ఇషా సింగ్ వరల్డ్ నం.1

**- ప్రపంచ షూటింగ్ ర్యాంకింగ్స్**

హైదరాబాద్ :భారత స్టార్ షూటర్, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ లేపింది. ఇటీవల వరుసగా మ్యూనిచ్, హాంగ్జౌ ప్రపంచకప్‌లలో పసిడి పతకాలు సాధించిన ఇషా సింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానికి ఎగబాకింది. మహిళల 25మీటర్ల పిస్టల్ విభాగంలో 6384 పాయింట్లతో ఇషా సింగ్ వరల్డ్ నం.1గా నిలిచింది. యాంగ్ జిన్ (దక్షిణ కొరియా–5834), షియావో (చైనా–4498), మను భాకర్ (భారత్–2002), యావో (చైనా–2005) టాప్–5లో నిలిచారు. మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో యావో (చైనా–7630) అగ్రస్థానం నిలుపుకోగా.. ఇషా సింగ్ 4961 పాయింట్లతో రెండో ర్యాంక్‌కు ఎగబాకింది. సురుచి సింగ్ (భారత్–4042) మూడో స్థానంలో కొనసాగుతుంది.




# ధనంజయ సారథ్యంలో...

**• భారత్‌తో టెస్టు సిరీస్‌కు శ్రీలంక జట్టు ఎంపిక**

కొలంబో : భారత్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ఆతిథ్య శ్రీలంక బుధవారం జట్టును ప్రకటించింది. ధనంజయ డిసిల్వ సారథ్య పగ్గాలు నిలుపుకోగా... నిరోశన్ డిక్‌వెల్లా, దిల్షాన్ మధుశంకలు మూడేండ్ల తర్వాత తిరిగి జట్టులో చోటు సాధించారు. కేశర నువాంత, పసిందు సూరియబండారలు సైతం టెస్టు జట్టులోకి వచ్చారు. దినేశ్ చండిమాల్, కామిందు మెండిస్, ధనంజయ డిసిల్వలు బ్యాటింగ్ లైనప్‌లో ఉండగా.. దినుశ, రమేశ్ మెండిస్, రత్నానాయకెలు ఆల్‌రౌండర్లు. ముగ్గురు స్పిన్నర్లు, నలుగురు పేసర్లను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. భారత్, శ్రీలంక తొలి టెస్టు గాలెలో శనివారం నుంచి ఆరంభం కానుంది. **శ్రీలంక టెస్టు జట్టు** ధనంజయ డిసిల్వ (కెప్టెన్), లహిరు ఉదర, నిశాన్ మధుష్క, కామిందు మెండిస్, దినేశ్ చండిమాల్, పసిందు సూరియబండార, సోనల్ దినుశ, నిరోశన్ డిక్‌వెల్లా, రమేశ్ మెండిస్, ప్రభాత్ జయసూరియ, కేశర నువాంత, మిలాన్ రత్నానాయక, అషిత ఫెర్నాండో, లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, దిల్షాన్ మధుశంక.

# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.



# అలా ..రజనీకాంత్ గారితో జతకట్టా శ్రియా శరణ్ అనుభవాలు

టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు.

అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.



# రజనీకాంత్ ధర్మన్ మూవీ సెకండ్ షెడ్యూల్ ప్రారంభం



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ సరసన సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, కమెడియన్ యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇదివరకే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ రక్తంతో తడిసిన సర్జికల్ టూల్ పట్టుకుని 'ది డెడ్లీ డాక్టర్' ట్యాగ్‌లైన్‌తో కనిపించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ రెండో షెడ్యూల్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అవుతోంది.

# ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన జూనియర్ ఎన్టీఆర్



ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆయన భుజానికి బుధవారం వైద్యులు విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన, గురువారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే వైద్యుల పర్యవేక్షణలో ఫిజియోథెరపీ (రిహాబిలిటేషన్) ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.“డ్రాగన్“ సినిమా చిత్రీకరణలో భాగంగా జూలై 27న ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆయన వేగంగా, సంపూర్ణంగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో, ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ ఆర్.ఏ. పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ నితిన్ బెజ్జంకి నేతృత్వంలోని వైద్య బృందం ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసింది. ఎన్టీఆర్ పూర్తిస్థాయిలో కోలుకోవడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టవచ్చని వైద్యులు అంచనా వేస్తున్నారు.శస్త్రచికిత్స అనంతరం ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, “సర్జరీ విజయవంతంగా పూర్తయింది. నేను ప్రస్తుతం క్షేమంగా ఉన్నాను. కిమ్స్ వైద్య బృందానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నాకు అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు ధన్యవాదాలు. మీ మద్దతే నా బలం. త్వరలోనే మళ్ళీ కలుద్దాం“ అని పేర్కొన్నారు.ఎన్టీఆర్‌కు గాయం కావడంతో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డ్రాగన్' చిత్ర శ్రీలంక షెడ్యూల్ వాయిదా పడింది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుండగా, అనిల్ కపూర్, బిజూ మీనన్, అశుతోష్ రాణా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

# సినీ లవర్స్‌కు పండగే పండగ

## నేడు ఒక్కరోజే ఆరు సినిమాలు విడుదల

పంద్రాగాస్ట్ సినీ లవర్స్‌కు పండగ చేయబోతోంది. పలు సినిమాలు 14న శుక్రవారం విడుదల కాబోతున్నాయి. ఇందులో సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకుతుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్నది చిత్ర కథ. విచిత్రమైన పాత్రలు... సరదా సంఘటనలు... ఊహించని మలుపులతో రూపొందుతున్న సినిమానే మా 'పళ్ళ బురుసు' అంటున్నారు ఉదయ్ చౌహాన్. ఆయన దర్శకత్వంలో.. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో రూపొందింది. 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, భావోద్వేగాల మేళవింపుగా ఓ పల్లెటూరి కథతో మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.'ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ 'అగధ' అంటున్నారు హీరో శ్రవణ్ రెడ్డి. ఆయన కీలక పాత్రలో కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ఎంఎస్ రాజు తెరకెక్కించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో భయపెట్టే అంశాలు మాత్రమే కాదు... అంతకుమించిన కథ ఉందని చిత్ర బృందం చెబుతోంది. 'నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ
నచ్చేలా ఉంటుంది' అంటున్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్ను, వాసవి గణేశన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని బిక్షు తెరకెక్కించారు. వెంకట్ యాదవ్ నిర్మించారు. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేస్తోంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా
ఆగస్టు 15న ఈ




మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఈ సమాజంలో కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని రూపొందించినట్లు దర్శకుడు చెబుతున్నారు.

ఇకపోతే విశాల్ కథానాయకుడిగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్, అంజలి కథానాయికలు. ఈ మూవీ తమిళ, తెలుగు భాషల్లో 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. లింగ, కృపాకర్ అనే రెండు వైవిధ్యమైన పాత్రల్లో మూడు విభిన్న గెటప్పులలో విశాల్ కనిపించిన విధానం.. యాక్షన్ అలరిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ ప్రధాన పాత్రలో 2007లో దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కించిన సినిమా 'ఆవారాపన్'. ఇప్పుడీ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'ఆవారాపన్ 2'. ఇమ్రాన్ హాష్మీ, దిశా పటానీ జంటగా నటిస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకుడు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇమ్రాన్ డైలాగ్స్‌తో పాటు దిశా
నటన అలరిస్తోంది.




ఇమ్రాన్ ఇందులో శివమ్ పండిట్ పాత్రలో కనిపించనున్నారు. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బట్వారా 1947' ప్రీతి జింటా, షబానా అజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రమిది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14న విడుదల కానుంది. దేశ విభజన కాలం నాటి హింసాత్మక పరిస్థితుల మధ్య చిక్కుకున్న ఓ కుటుంబ నేపథ్యంలో భావోద్వేగభరితంగా ఈ సినిమాను తీర్చిదిద్దారు.

----

# అతిగా ఫోన్ వాడకంతో 3 లక్షలు బొక్క నటి షకీలాకు చేదు అనుభవం

ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. రీల్స్ మోజులో అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు 'ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి' అని షకీల కోరారు. 18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com